

సోమశిలలో 32.303 టీఎంసీల నీరు నిల్వ



అనంతసాగరం: సోమశిల జలాశయానికి ఎగువ నుంచి ఆదివారం 24 క్యూసెక్కుల ప్రవాహం వస్తున్నట్లు అధికారులు తెలిపారు. డ్యాం పూర్తిసామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా, 32.303 టీఎంసీల నీరు నిల్వ ఉంది. దిగువ డెల్టాకు 2,700 క్యూసెక్కులు, ఉత్తర కాలువకు 250, దక్షిణ కాలువకు 20 క్యూసె క్కుల నీటిని సరఫరా చేస్తున్నామని వారు తెలిపారు.



నెల్లూరులోని టిడ్కో ఇళ్లను పరిశీలిస్తున్న చైర్మన్ ప్రసన్న కుమార్, తదితరులు

మూడో వారంలో టిడ్కో ఇళ్ల పంపిణీ

- నెల్లూరు, వెంకటగిరిలో లబ్ధిదారులకు వితరణ
- చైర్మన్ ప్రసన్న కుమార్ వెల్లడి

నెల్లూరు జడ్పీ, జనవరి7: నెల్లూరు నగర పాలక సంస్థ, వెంకటగిరి మున్సిపాలిటీ పరిధిలో పూర్తయిన టిడ్కో గృహాలను జనవరి 3వవారంలో లబ్ధిదారులకు పంపిణీ చేయనున్నట్టు టిడ్కో చైర్మన్ ప్రసన్నకుమార్ తెలిపారు. నెల్లూరు నగరంలోని టిడ్కో గృహాలను ఆయన ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నెల్లూరు కార్పొరేషన్, వెంకటగిరి మున్సిపాలిటీ పరిధిలో 16,500 గృహాలను లబ్ధిదారులకు అందజేయనున్నామని చెప్పారు. మున్సిపల్ శాఖామంత్రి ఆదిమూలం సురేష్, జిల్లా మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి, స్థానిక ఎమ్మెల్యేల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించనున్నామని చెప్పారు. ఆయన వెంట టిడ్కో ఎస్‌ఈ జాన్ సైమన్‌రావు, ఈఈ శాస్త్రి తదితరులు ఉన్నారు.

షోకాజ్ నోటీసులు అన్యాయం

- కాపీలు దహనం చేసిన ఎస్ఎస్ఏ ఉద్యోగులు

నెల్లూరు (విద్య), జనవరి 7 : చట్టబద్ధంగా తమ హక్కుల కోసం సమ్మె చేస్తున్న ఉద్యోగులకు షోకాజ్ నోటీసులు ఇవ్వడం అన్యాయమని సమగ్రశిక్ష ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగుల జేఏసీ నేతలు ఆరోపించారు. కలెక్టరేట్ ఎదుట చేస్తున్న సమ్మెలో భాగంగా ఆదివారం షోకాజ్ నోటీసుల ప్రతులను దహనం చేశారు. ఎస్పీడీతో చర్చలు జరిగినప్పుడు కూడా తమతో సానుకూలంగా మాట్లాడి షోకాజ్ నోటీసులివ్వడం ఏమిటని ప్రశ్నించారు. ఉద్యోగుల సమ్మెకు న్యాయవాదుల బృందం మద్దతు తెలియచేసింది. జేఏసీ నేతలు, ఉద్యోగులు పాల్గొన్నారు.

యాప్‌లతో యాతన

- తాజాగా మరో యాప్‌ను తీసుకువచ్చిన ప్రభుత్వం
- ఒత్తిడితో ఉపాధ్యాయుల విధి నిర్వహణ
- బోధన కంటే బోధనేతర పనులే వారికి ఎక్కువ
- తలలు పట్టుకుంటున్న టీచర్లు



నెల్లూరు (విద్య), జనవరి 7: విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పించాల్సిన గురువులు నిత్యం యాప్‌లతో యాతన పడుతూ ప్రభుత్వ వేధింపులకు గురవుతున్నారు. పాఠశాలల్లో బోధన కంటే బోధనేతర పనులకు ఉపాధ్యాయులు ఎక్కువ సమయం కేటాయించాల్సి వస్తోంది. విద్యాశాఖ ప్రవేశపెట్టిన వివిధ యాప్‌లలో వివరాలు నమోదు చేయడానికి వారు తంటాలు పడుతున్నారు. పిల్లలకు బోధించడానికి ఎనిమిది పీరియడ్లు ఉంటే బోధనేతర పనులు నిర్వహించడానికి రోజుకు మూడు, నాలుగు గంటలు సమయం పడుతోంది. వీటితో పాటు అటెండెన్స్ యాప్‌ను తీసుకురావడం, ఈ యాప్ సరిగా పనిచేయకపోవడం, నెట్‌వర్క్ సరిగా లేకపోవడం.. తదితర కారణాలతో అటెండెన్స్ ఆలస్యమైతే వెంటనే సంబంధిత ఉపాధ్యాయుల ఫోన్‌లకు అధికారుల నుంచి బెదిరింపుల మెసేజ్‌లు వస్తున్నాయి. తాజాగా వచ్చిన కొత్తయాప్‌లో విద్యార్థుల హాజరుకు సంబంధించి నాలుగు అంశాలను నమోదు చేయాల్సి ఉంది. దీంతో ఉపాధ్యాయులు తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారు.

యాప్ రూపంలో మరో పిడుగు

ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులపై యాప్ రూపంలో మరో పిడుగు పడింది. ప్రభుత్వం ఇప్పటికే నిర్దేశించిన యాప్‌లతో సతమతమవుతుండగా కొత్తగా వచ్చిన యాప్‌తో ఎన్ని ఇబ్బందులు ఎదుర్కొనాల్సి వస్తుందోనని టీచర్లు తలలు పట్టుకుంటున్నారు. ఇటీవల వచ్చిన కొత్త యాప్‌లో విద్యార్థుల హాజరుకు సంబంధించి నాలుగు అంశాలను నమోదు చేయాల్సి ఉంది. ప్రతిరోజూ ఉదయం తరగతి గదిలో మొదటి పీరియడ్‌లోనే విద్యార్థుల వివరాలను వ్యక్తిగతంగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి. ఆ ప్రకారం పాఠశాలలకు హాజరు కాని విద్యార్థి ఏ కారణం చేత రాలేదన్న విషయాన్ని కొత్తయాప్‌లో స్పష్టం చేయాలి. విద్యార్థి పాఠశాలకు రాకపోవడానికి మొదటి కారణంగా నాట్ ఫీల్ గుడ్(స్కూల్ అంటే ఇష్టం లేకనా) అని ఉంటుంది. రెండో అంశంలో వలసపోయారా..? మూడో అంశం ఇతర పాఠశాల నుంచి టీసీలు తీసుకురాలేదా... ? నాలుగో అంశం లాంగ్ ఆబ్సెంట్ అని ఉంటుంది. వీటిలో ఏదో ఒకటి స్పష్టం చేయాలి. చిన్నచిన్న పాఠశాలల్లో ఈ తరహా నమోదులు పెద్ద సమస్య కాదు కానీ.. పెద్ద సంఖ్యలో విద్యార్థులుండే పాఠశాలల్లో మాత్రం తొలి పీరియడ్‌లో ఇన్ని వివరాలు ఎలా నమోదు చేయాలని ఉపాధ్యాయులు ప్రశ్నిస్తున్నారు. యాప్‌లతోనే తమకు సమయం అంతా గడిచిపోతుంటే ఇక పాఠాలు ఎప్పుడు చెప్పాలో అర్థం కావడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బోధనేతర పనులే అధికం

పాఠశాలల్లో బోధన కంటే బోధనేతర పనులకే ఉపాధ్యాయులు అధిక సమయం కేటాయిస్తున్నారు. పాఠశాలకు సమయానికి హాజరు కావడం, విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజనం ఫొటోలు అప్‌లోడ్, ప్రత్యేక అటెండెన్స్ అప్‌లోడ్, టీచింగ్ నోట్స్‌లు రాయడం, వర్క్‌బుక్‌లు కరెక్షన్ చేయడం, సిలబస్ ఎంత వరకు పూర్తి చేసారన్న విషయాన్ని నిత్యం మెసేజ్ పెట్టడం, స్టాక్ రిజిస్టర్‌లు పక్కాగా నిర్వహించడం, విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశాలు, అధికారుల సమావేశాలు, విద్యా సంబంధిత కార్యక్రమాలు... ఇలా అనేక బోధనేతర పనుల్లో ఉపాధ్యాయులు బిజీబిజీగా ఉంటున్నారు. మరోవైపు విద్యాశాఖ ఉన్నతాధికారులు పాఠశాలల్లో బోధన సకాలంలో పూర్తి చేయాలని, పరీక్షలు సమీపిస్తున్న తరుణంలో విద్యార్థులను సంసిద్ధులను చేయాలని ఒత్తిడి చేస్తున్నారు. ప్రభుత్వం తమపై కక్షగట్టి వేధింపులకు పాల్పడుతూ ఇబ్బందులకు గురిచేస్తోందని ఉపాధ్యాయులు ఆవేదన చెందుతున్నారు. ఉపాధ్యాయులను వేధిస్తే తగిన సమయంలో, తగిన రీతిలో బుద్ధి చెపుతామని, సమయం కోసం ఎదురు చూస్తున్నామని ఉపాధ్యాయ సంఘాలు చెబుతున్నాయి.



కావలిలో ఎస్మా జీవో ప్రతులను దహనం చేస్తున్న అంగన్‌వాడీలు

ఎస్మా పత్రాల దహనం

- కొనసాగుతున్న అంగన్‌వాడీల నిరసన

నెల్లూరు(హరనాథపురం), జనవరి 7: ఎస్మాను ప్రయోగించడాన్ని వ్యతిరేకిస్తూ నెల్లూరు నగరంలోని వేదాయపాళెంలో ఉన్న బాబూ జగజ్జీవన్‌రామ్ విగ్రహం ఎదుట ఆదివారం అంగన్‌వాడీలు ఎస్మా ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ నెల్లూరు రూరల్ కార్యదర్శి కిన్నెర కుమార్ మాట్లాడుతూ అంగన్‌వాడీలపై ప్రయోగించిన ఎస్మాను ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకో వాలని డిమాండ్ చేశారు. అంగన్ వాడీ వర్కర్స్ యూనియన్ రూరల్ కార్యదర్శి సంపూర్ణ మాట్లాడుతూ తమ డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించక పోగా ఎస్మాను ప్రయోగించటం విచారకరమన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ రూరల్ అధ్యక్షుడు కొండా ప్రసాద్, అంగన్‌వాడీ రూరల్ అధ్యక్షురాలు కుమారి పాల్గొన్నారు.

- నెల్లూరు రూరల్ మండలం సౌత్‌మోపూరు సెక్టార్ పరిధిలోని అంగన్ వాడీలు ఆదివారం వెల్లంటిలో నిరసన వ్యక్తం చేశారు.
- కావలిలో ఆదివారం అంగన్‌వాడీలో సమ్మె శిబిరంలో ఎస్మా ప్రతులను తగులబెట్టారు.
- కందుకూరులో అంగన్‌వాడీలు రిలే నిరసన దీక్ష కొనసాగిస్తున్నారు.

ఎస్మా ప్రయోగం దుర్మార్గం : బీటీఏ

నెల్లూరు (విద్య) : అంగన్‌వాడీ వర్కర్స్‌పై ఎస్మా ప్రయోగం దుర్మార్గమని, దాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని బీటీఏ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మణిసుబ్బు, మాస ప్రసాద్ ఆదివారం ఓ సంయుక్త ప్రకటనలో డిమాండ్ చేశారు. తమ సమస్యల పరిష్కారం కోసం శాంతియుతంగా సమ్మె చేస్తున్న వారిపై రాష్ట్ర ప్రభుత్వం నిరంకుశత్వంతో ఎస్మా ప్రయోగించిందని వారు పేర్కొన్నారు. హక్కులను కాలరాస్తూ ప్రశ్నించిన వారిపై ఉక్కుపాదం మోపడం అన్యాయమన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా తన తీరు మార్చుకోవాలని, లేని పక్షంలో రానున్న రోజుల్లో తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని వారు హెచ్చరించారు.



నెల్లూరు కపాడిపాళెం చర్చిలో ప్రార్థనలు చేస్తున్న మున్సిపల్ కార్మికులు

ఏసయ్యా.. నువ్వైనా చెప్పయ్యా !

- చర్చిలో మున్సిపల్ కార్మికుల ప్రార్థనలు

నెల్లూరు(సిటీ),జనవరి 7 : ఏసయ్యా.. జగన్ మనసు మార్చి.. మా సమస్యలు పరిష్కరించమని నువ్వైనా చెప్పయ్యా... అంటూ మున్సిపల్ కార్మికులు ఆదివారం చర్చిలో ప్రార్థనలు చేశారు. నెల్లూరులోని కపాడిపాళెం వద్ద ఉన్న క్యాథలిక్ మిషన్ చర్చిలో వారు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం సీఐటీయూ నాయకులు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులకు ఇచ్చిన హామీలను నెరవేర్చమని అడిగితే, వాటిపై స్పష్టత ఇవ్వని దుస్థితిలో ప్రభుత్వం ఉందని తెలిపారు. సమాన పనికి సమాన వేతనం, ఏళ్ల తరబడి ఔట్‌సోర్సింగ్‌లో పని చేస్తున్న వారిని పర్మినెంట్ చేయాలని కోరడం తప్పా..? అంటూ వారు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. అనంతరం నగరంలోని పుచ్చలపల్లి సుందరయ్య విగ్రహం వరకు నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు అల్లాడి గోపాల్, కత్తి శ్రీనివాసులు, దేశమూర్తి, సూర్యనారాయణ, అశోక్‌లు పాల్గొన్నారు.

- ఆత్మకూరులో సీఐటీయూ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులు పట్టణంలోని ప్రధాన రహదారి వెంబడి భిక్షాటన చేస్తు నిరసన వ్యక్తం చేశారు.



కావలిలో పొర్లుదండాలు పెడుతూ నిరసన తెలుపుతున్న మున్సిపల్ కార్మికులు

- కావలిలో సీఐటీయూ అనుబంధ సంఘం మున్సిపల్ కార్మికులు పొర్లుదండాలతో నిరసన తెలిపారు.
- కందుకూరులోని అంబేడ్కర్ విగ్రహం సెంటర్‌లో మున్సిపల్ కార్మికులు నిరసన దీక్ష కొనసాగించారు.

అతివేగం, అజాగ్రత్తే కారణం..

- మోచర్ల వద్ద లారీని ఢీకొన్న టీఎస్ ఆర్టీసీ బస్సు
- ఇద్దరు మృతి, ఆరుగురికి గాయాలు
- బాధితులంతా తెలంగాణ వాసులే...

కందుకూరు/ గుడ్లూరు, జనవరి 7: అతివేగం, అజాగ్రత్త రెండు నిండు ప్రాణాలను బలితీసుకుంది. జాతీయ రహదారిపై గుడ్లూరు మండలం మోచర్ల సమీపంలో ఆదివారం తెల్లవారుజామున ముందువెళ్తున్న లారీని వేగంగా వెళ్తున్న టీఎస్‌ఆర్టీసీ బస్సు ఢీకొంది.ఈ ప్రమాదం లో ఆర్టీసీ డ్రైవరు పోకల వినోద్‌కుమార్ (28), ప్రయాణికురాలు ప్రగడా సీత (55) మృతిచెం దారు. మరో ఆరుగురికి తీవ్ర గాయాలయ్యాయి. హైదరాబాద్ నుంచి శ్రీకాళహస్తి మీదుగా తిరుపతికి వెళ్లే ఆర్టీసీ బస్సును డ్రైవర్ వినోద్‌కు మార్ అతివేగంతో నిర్లక్ష్యంగా నడపటం వల్లే ఈ ప్రమాదం జరిగింది. మృతులు, క్షతగాత్రులంతా తెలంగాణ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన వారు. ప్రమాద సమయంలో బస్సులో 30 మంది ప్రయాణికులు ఉండగా మిగిలిన వారంతా క్షేమంగా బయటపడ్డారు. మృతిచెందిన బస్సు డ్రైవర్‌ది నల్గొండ జిల్లా దామరచర్ల మండలం తాళ్లవీరప్పగూడెం గ్రామం. మృతురాలు సీతది సూర్యాపేట జిల్లా బ్రాహ్మణనేరేడుచర్ల గ్రామం. బస్సు డ్రైవర్ ఘటనాస్థలంలోనే మృతిచెందగా, సీత నెల్లూరు అపోలో వైద్యశాలకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందింది. ఈ ప్రమాదంలో సీత కుమారుడు ప్రగడా సీతారాం, మరో ప్రయాణికుడు కందాల ఉమాకాంత్‌లు నెల్లూరు అపోలో వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. స్వల్పగాయాలతో బయటపడిన కత్తి సంజయ్‌కుమార్, అడపాల కోటేశ్వరరావు, అడపాల శ్రీలక్ష్మి, బస్సులోని మరో డ్రైవర్ వెంకన్నలు కావలి ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు.



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన తెలంగాణ ఆర్టీసీ బస్సు డ్రైవర్ వినోద్



చికిత్స పొందుతూ మృతి చెందిన ప్రయాణికురాలు సీత

హైవేపై హాహాకారాలు

ప్రయాణికులంతా గాఢ నిద్రలో ఉన్న సమయంలో ఒక్కసారిగా పెద్దశబ్దంతో కుదుపులు రావటంతో ఒక్కసారిగా హతాశులై నిద్రలేచారు. నిద్రలోంచి మేలుకొనేసరికే కొందరు క్షతగాత్రులు కాగా, మరికొందరు ముందు సీట్లను గుద్దుకుని చిన్నచిన్న గాయాలతో ఉన్నారు. దీంతో ఏమి జరిగిందో అర్థంకాక ప్రయాణికులంతా హాహాకారాలు చేశారు. ప్రమాదంలో బస్సు ముందు భాగమంతా నుజ్జునుజ్జయి డ్రైవర్ సీట్లోనే అసువులు బాశాడు. కొందరు ప్రయాణికులు తేరుకుని సహాయక చర్యలు ప్రారంభించారు. గుడ్లూరు ఎస్‌ఐ ప్రసాదరెడ్డి తమ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. హైదరాబాద్ నుంచి తిరుపతికి వెళ్లే ఆర్టీసీ బస్సు కావటంతో వివిధ ప్రాంతాల్లో ఆ బస్సు ఎక్కిన వారంతా తిరుపతి దైవదర్శనానికి కుటుంబాలతో వెళ్తున్న వారేనని తెలిసింది. చిన్నచిన్న గాయాలైన పలువురు ఆసుపత్రికి వెళ్లేందుకు ఇష్టపడకుండా ప్రత్యామ్నాయ వాహనాల్లో తిరుపతికి వెళ్లారని ప్రత్యక్షసాక్షులు తెలిపారు.





చికిత్స పొందుతున్న క్షతగాత్రులు



కావలిలో చికిత్స పొందుతున్న బాధితులు

కాలువా... కబ్జా చేసేయ్ !

- నెల్లూరు నగరంలో పెరుగుతున్న ఆక్రమణలు
- యథేచ్ఛగా అక్రమ కట్టడాలు
- ఇరిగేషన్ అధికారులపై ఫిర్యాదుల వెల్లువ
- సర్వేకు ముందుకురాని రెవెన్యూ అధికారులు
- అక్రమార్కులతో కుమ్మక్కు ?
- జేసీ ఆదేశించినా పట్టించుకోని వైనం !

- నెల్లూరులోని ఇరిగేషన్ సర్కిల్ కార్యాలయానికి కూతవేటు దూరంలో మినీబైపాస్‌ను ఆనుకుని ఉన్న శ్రీహరినగర్ వద్ద పెద్ద పంట కాలువ ఆక్రమణలకు గురవుతోంది. ఈ కాలువకు రెండు వైపులా ఉన్న స్థల యజమానులు కొద్ది కొద్దిగా కాలువను పూడ్చుకుంటూ వస్తున్నారు. ఉత్తరం వైపు ఓ వ్యక్తి ఏకంగా భారీగా నిర్మాణం చేసేందుకు గోడ కూడా నిర్మించారు. దీంతో వర్షపు, డ్రైనేజీ నీటిని నగరం వెలుపలకు తీసుకెళ్లే ప్రధాన కాలువ కుచించుకుపోతోంది. రోడ్డును వెళ్లే ప్రతి ఒక్కరికీ ఈ దుస్థితి కనిపిస్తుంటుంది.

- నగరంలోని మాగుంట లేఅవుట్ నుంచి సాగు, వర్షపు, మురుగునీటిని సర్వేపల్లి కాలువలోకి తీసుకెళ్లే ఓ కాలువను అన్నమయ్య సర్కిల్‌లో ఆక్రమించారు. చుక్క నీరు ఆ కాలువ గుండా పారేందుకు వీల్లేకుండా పూడ్చేశారు. ఇప్పుడు ఏకంగా ఆ కాలువపై ఐదు అంతస్థుల నిర్మాణాన్ని చేపట్టారు. ఈ నిర్మాణానికి కార్పొరేషన్ సిబ్బంది అనుమతులు ఎలా ఇచ్చారన్నది కూడా అనుమానంగా ఉంది. కాగా ఆ పక్కనే పీవీఆర్ కల్యాణ మండపం ఎదురుగా ఉన్న ప్రాంతంలో మరో పంట కాలువను కూడా పూడ్చేసి తమ స్థలాల్లో కలిపేసుకున్నారు.

నెల్లూరు(ఆంధ్రజ్యోతి)

ఇలా నెల్లూరు నగరంలో విచ్చలవిడిగా పంట కాలువలను ఆక్రమిస్తున్నారు. ఒకప్పుడు పంట కాలువలుగా ఉన్నవి ఇప్పుడు డ్రైనేజీ కాలువలుగా మారాయి. పంట కాలువలు ఇరిగేషన్‌కు సంబంధించినవి కదా ? మాకేం సంబంధం అన్నట్లు మున్సిపల్ కార్పొరేషన్ సిబ్బంది వ్యవహరిస్తున్నారు. వారి కళ్ల ముందు ఆక్రమించి నిర్మాణాలు చేస్తున్నా పట్టించుకోవడం లేదు. ఇక ఇరిగేషన్ అధికారులకు ఎవరో ఒకరు చెబితేగానీ ఈ ఆక్రమణలు తెలియడం లేదు. అందులోనూ ఇప్పుడు ఆ కాలువలను కార్పొరేషన్ ఉప యోగించుకుంటోంది కదా ? అంటూ ఉదాసీనత ప్రదర్శి స్తున్నారు. ఎవరైనా ఫిర్యాదులు చేస్తే మాత్రం స్పందిస్తు న్నారు. అయితే వారికి రెవెన్యూ సిబ్బంది నుంచి మాత్రం సహకారం అందడం లేదు. ఫలానా కాలువను ఆక్రమి స్తున్నారని ఫిర్యాదులు అందుతున్నాయి.. ఆ కాలువలను సర్వే చేసి మా హద్దులు చూపిస్తే మేమే రక్షించుకుంటాం.. అని పలుమార్లు మండల రెవెన్యూ అధికారులకు లేఖలు రాసినా ఫలితం ఉండడం లేదు. దీంతో అక్రమార్కులు చకచకా నిర్మాణాలు చేసేస్తున్నారు. ఆ తర్వాత రాజకీయ ఒత్తిళ్లు చేయడం, కుదరకపోతే అధికారులను కోర్టులకు తిప్పడం చేస్తున్నారు. ప్రారంభంలోనే ఆక్రమణలను అడ్డుకుంటే ఎలాంటి సమస్య ఉండదు. కానీ ప్రస్తుతం రెవెన్యూ సిబ్బంది నుంచి సహకారం అందడం లేదు. కాగా ప్రభుత్వ ఆస్తుల రక్షణలోనూ రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంపై విమర్శలు వెల్లువెత్తు తున్నాయి. ఒక కాలువను సర్వే చేసి హద్దులు చూపించ డానికి గంట సమయం సరిపోతుంది. కానీ ఆ పని చేసేందుకు మండల సర్వే అధికారులు ముందుకు రాకపోతుండడం పలు అనుమానాలకు తావిస్తోంది. అక్రమార్కులతో సర్వే సిబ్బంది కుమ్మక్కవుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.


లేఖ రాసినా స్పందన లేదు..

శ్రీహరినగర్‌లో కాలువ ఆక్రమణపై సర్వే చేయాలని కొన్ని నెలల క్రితం సర్వే అధికారులకు ఇరిగేషన్ అధికారులు లేఖ రాశారు. కానీ ఇంతవరకు స్పందించలేదు. ఈ విషయాన్ని జేసీ రోణంకి కూర్మనాథ్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన కూడా మండల సర్వే అధికారులను ఆదేశించారు. అయినా పట్టించుకోలేదు. ఇక మాగుంట లేఅవుట్, అన్నమయ్య సర్కిళ్ల వద్ద కాలువలు ఉన్నట్లు నగర పటంలో కనిపిస్తోంది. వాటికి హద్దులు చూపించాలని పలుమార్లు కోరినా రెవెన్యూ సిబ్బంది నుంచి స్పందన ఉండడం లేదని ఇరిగేషన్ అధికారులు చెబుతున్నారు. కాలువల ఆక్రమణలను అధికారులు తేలిగ్గా తీసుకుంటుండగా, అది వర్షాలు కురిసినప్పుడు నగర ప్రజలకు చాలా పెద్ద సమస్యగానే మారుతోంది.

రెండు రోజుల్లో సర్వే చేస్తాం

కాలువల ఆక్రమణలకు సంబంధించి ఇరిగేషన్ అధికారుల నుంచి కొన్ని లేఖలు వచ్చాయి. వాటిని పరిశీలించి రెండు రోజుల్లో సర్వే చేస్తాం. కాలువ హద్దులను తేల్చి ఇరిగేషన్ సిబ్బందికి అప్పగిస్తాం.

- సోమ్లా నాయక్, నెల్లూరు రూరల్ తహసీల్దార్



సర్వే చేయాలని రాశాం

మాగుంట లేఅవుట్, శ్రీహరి నగర్ వద్ద కాలువలను ఆక్రమిస్తున్నట్లు ఫిర్యాదులు అందాయి. ఈ కాలువలను సర్వే చేసి హద్దులు చూపించాలని రెవెన్యూ అధికారులకు లేఖలు రాశాం. వారు సర్వే చేయగానే ఆక్రమణలు తొలగిస్తాం.

- ఎం అనీల్‌కుమార్‌రెడ్డి, ఇరిగేషన్ నెల్లూరు డీఈ

భూమి కంచె ధ్వంసం

● అగ్రవర్ణాల పనేనని దళితుడి ఆవేదన


ధ్వంసమైన కంచె రాళ్లు

కలిగిరి, జనవరి 7: మండలంలోని తెల్లపాడులో దళితుడికి చెందిన భూమికి వేసిన కంచె రాళ్లను కొందరు వ్యక్తులు ధ్వంసం చేశారని బాధితుడు కందుల చిన్నయ్య తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ తనకు చెందిన సర్వే నెంబరు 196-4-5లలో 4.55 ఎకరాల భూమిలో కంచె వేసుకున్నానన్నారు. పక్కనే ఉన్న అగ్రవర్ణాలకు చెందిన భూ యజమానులు రామారావు, నందగోపాల్, శ్రీనివాసరాజులు తాను లేని సమయంలో శనివారం సాయంత్రం ప్రభుత్వ సర్వేయరుతో పొలాన్ని సర్వే చేయించి తమ భూమిలో కంచెకు వేసిన రాళ్లను, తీగను ధ్వంసం చేసినట్లు బాధితుడు ఆవేదన వ్యక్తం చేశారు. అయితే దీనిపై స్థానికంగా ఏ అధికారులకు ఫిర్యాదు చేసినా తనకు న్యాయం జరగదని, సోమవారం జిల్లా కలెక్టర్‌తో పాటు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తానన్నారు. ఈ విషయమై సర్వేయరు శివరంజనిని వివరణ కోరగా భూయజమానులు రామారావు, నందగోపాల్, శ్రీనివాసరాజులు సర్వేకు చలానా కట్టారన్నారు. దీనిపై ఇరువర్గాలకు సమాచారం ఇచ్చామని, అయితే కందుల చిన్నయ్య ఎన్నిసార్లు చెప్పినా స్పందించకపోవడంతో భూమిని సర్వేచేసి చెలానా కట్టిన రైతులకు హద్దులు చూపించానన్నారు.

బెల్టుషాపుపై దాడి

50 మద్యం సీసాల పట్టివేత

మనుబోలు, జనవరి 7: మండలంలోని మడమనూరు గ్రామంలో బెల్టుషాపు నిర్వహిస్తున్నట్లు సమాచారం రావడంతో ఆదివారం ఎస్‌ఐ జి అజయ్‌కుమార్ తన సిబ్బంది తో గ్రామంలోని పన్నెం నరసయ్య ఇంట్లో దాడులు నిర్వ హించారు. ఇంట్లో ఉన్న 50 మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని, నిర్వాహకుడిని అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.


సీసాలు, నిర్వాహకుడిని చూపుతున్న ఎస్‌ఐ అజయ్‌కుమార్

కలువాయి : కలువాయి మండలం తెలుగురాయపురం సమీపంలో ఆదివారం 96 మద్యం సీసాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. చేజర్ల నుంచి తెలుగురాయపురంకు మోటారు సైకిల్‌పై మద్యం తీసుకొస్తుండగా పోలీసులు వెంబడించి పట్టుకున్నారు. తెలుగురాయపురంకు చెందిన సోకా అఖిల్‌ను అదుపులోని తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ అయ్యప్ప తెలిపారు.

ఓడూరుకు పలువురి నివాళి


ఓడూరు పార్థీవదేహం వద్ద నివాళులు అర్పిస్తున్న మంత్రి కాకాణి

మనుబోలు, జనవరి 7: రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన బీజేపీ మండలాధ్యక్షుడు ఓడూరు శ్రీనువాసులు రెడ్డికి ఆదివారం పలువురు నివాళులు అర్పించారు. బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి సురేంద్రరెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి కర్నాటి ఆంజనే యరెడ్డి, జిల్లా అధ్యక్షుడు చీపారెడ్డి వంశీ. దర్‌రెడ్డి, తిరుపతి పార్లమెంట్ అధ్యక్షుడు చంద్రప్ప, రాష్ట్ర కార్యవర్గసభ్యుడు పనబాక కోటేశ్వర రావు, జిల్లా కార్యవర్గ సభ్యుడు బోలా శ్రీనువాసులు తదితరులు ఓడూరు నివాసానికి చేరుకుని ఆయన పార్థివదేహానికి నివాళులు అర్పించారు. అలాగే రాష్ట్ర వ్యవసాయ మంత్రి కాకాణి గోవ ర్థన్‌రెడ్డి ఓడూరు పార్థీవదేహం వద్ద నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను పరామ ర్శించి ప్రగాడ సానుభూతిని వ్యక్తం చేశారు.

బంగారం వ్యాపారులపై దాడి

● రూ.కోటి అభరణాల దోపిడీ

నెల్లూరు(క్రైం), జనవరి 7: బంగారం వ్యాపారులపై గుర్తుతెలియని దుండగులు దాడి చేసి రూ.కోటి విలువ చేసే బంగారు అభరణాలు, నగదు దోచుకెళ్లారు. నెల్లూరు నగరంలో శనివారం అర్ధరాత్రి జరిగిన ఈ ఘటన సంచలనంగా మారింది. వివరాలు ఇలా ఉన్నాయి.

నెల్లూరులోని రామ్మూర్తినగర్ మూడో వీధిలో గల ఓ అపార్ట్‌మెంట్‌లో చంద్రశేఖర్‌రావు, హరికోటేశ్వరరావు అన్నదమ్ములు నివసిస్తున్నారు. వీరు మండపాల వీధిలో బంగారు నగల దుకాణం నిర్వహిస్తున్నారు. ఆభరణాలు విక్రయించడంతోపాటు ఆర్డర్లపై ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని పలు బంగారు దుకాణాలకు నగలు సరఫరా చేస్తుంటారు. వీరికి మండపాలవీధికి చెందిన బంగారు వ్యాపారి రామాచారి స్నేహితుడు. ఈ నెల 6వ తేదీన హరికోటేశ్వరరావు తన వద్ద, స్నేహితుని వద్ద ఉన్న సుమారు 2 కేజీల బంగారు ఆభరణాలను తీసుకుని విక్రయించేందుకు గూడూరుకు వెళ్లాడు. అక్కడ కొన్ని ఆభరణాలను విక్రయించగా కొందరు వ్యాపారులు బకాయి తాలూకు రూ.10 లక్షల నగదు ఇచ్చారు. దీంతో హరికోటేశ్వర రావు 1,758 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.10 లక్షల నగదును బ్యాగ్‌లో పెట్టుకుని శనివారం రాత్రి గూడూరు నుంచి ఆర్టీసీ బస్సులో నెల్లూరుకు బయలుదేరారు. అన్న చంద్రశేఖర్‌రావు ఆర్టీసీ బస్టాండుకు వెళ్లి హరికోటేశ్వర రావును బైక్‌పై ఎక్కించుకుని ఇంటికి బయలుదేరారు. రామలింగాపురం అండర్ బ్రిడ్జి మీదుగా న్యూ జ్యోయాలుకాస్ జ్యూయలరీ షాపు సమీపంలోకి వచ్చే సరికి ముఖానికి మాస్క్ ధరించిన ముగ్గురు గుర్తుతెలియని వ్యక్తులు బైక్‌పై వచ్చి వారిని అడ్డుకున్నారు. ఓ వ్యక్తి బైక్ దిగి బంగారు వ్యాపారులపై దాడి చేసి నగల బ్యాగ్‌ను లాక్కుని బైక్‌పై పరారయ్యాడు. హఠాత్తుగా జరిగిన దాడితో నివ్వెరపోయిన అన్నదమ్ములు తేరుకొనేలోపే దుండగులు అందరూ పారిపోయారు. బాధితుడు హరికోటేశ్వరరావు బాలాజీ నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇన్‌స్పెక్టర్ వీరా నాయక్ కేసు నమోదు చేశారు. దర్యాప్తు లో భాగంగా సీసీటీవీ ఫుటేజీలను పరిశీలిస్తున్నారు. కాగా, దోపిడీ అనంతరం దుండగులు ఆత్మకూరు బస్టాండువైపు వెళ్లినట్లు సమాచారం.

టిప్పర్ బోల్తా


బోల్తాపడిన టిప్పర్

సైదాపురం, జనవరి 7: అదుపు తప్పి టిప్పర్ బోల్తాపడిన సంఘటన మండల పరిధిలోని తురిమెర్ల గ్రామం వద్ద ఆదివారం జరిగింది. స్థానికుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పొమూరు నుంచి తురిమెర్ల గ్రామం మీదుగా అధిక లోడుతో తెల్లరాయి తీసుకెళ్తున్న టిప్పర్ అదుపు తప్పి బోల్తాపడింది. టిప్పర్ బోల్తా పడినప్పుడు రోడ్డుపై ఎవ్వరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. కాగా, సైదాపురం నుంచి డేగపూడి వరకు ఆర్‌అండ్‌బీ రోడ్డు గుంతల మయంగా ఉండి తరచూ వాహనాలు బోల్తా పడుతున్నాయని, సంబంధిత శాఖాధికారులు స్పందించి అధిక లోడుతో తిరుగుతున్న వాహనాలపై చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	90
లేయర్ లైవ్	85
స్కిన్ చికెన్	170
స్కిన్‌లెస్	190
లేయర్	145

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ. 5982
వెండి కిలో ధర	రూ. 74,000
వెండి ఒక గ్రాము	రూ. 76.00

పంది దాడి..
వృద్ధురాలికి తీవ్రగాయాలు


మహిళ చేయిపై గాయం

బిట్రగుంట, జనవరి 7: బోగోలు మండలం విశ్వనాథరావుపేటలో వృద్ధురాలు షేక్.అమీనాఖానుస్‌పై ఆదివారం సాయంత్ర పంది దాడి చేయడంతో ఆమెకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల వివరాల మేరకు.. వృద్ధురాలు తన కుమార్తె ఇంటి నుంచి తిరిగి వెళుతున్న సమయంలో హోరేబు చర్చి సమీపంలో పంది దాడి చేసింది. దీంతో ఆమెకు చేయి విరిగింది. స్థానికులు గుర్తించి పందిని తరుముకోవడంతో వృద్ధురాలు ప్రాణాలతో బయటపడింది. క్షతగాత్రురాలిని చికిత్స నిమిత్తం 108 వాహనంలో ఆసుపత్రికి తరలించారు.

10లోగా
ఇంటర్ పరీక్ష ఫీజు చెల్లించాలి

నెల్లూరు (విద్య), జనవరి 7 : ఈ ఏడాది మార్చిలో జరగనున్న ఇంటర్ పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు రూ.2500 అపరాధ రుసుముతో ఈనెల 10వతేదీ వరకు పరీక్ష ఫీజు చెల్లించవచ్చని ఇంటర్‌బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణాధికారి డాక్టర్ ఏ శ్రీనివాసులు ఓ ప్రక టనలో పేర్కొన్నారు. సకాలంలో ఫీజులు చెల్లించని విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియో గం చేసుకునేలా సంబంధిత కళాశాలల ప్రిన్సిపాళ్లు చొరవ చూపాలని సూచించారు. విద్యార్థులంతా పరీక్షకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అలాగే జన్ భాగీదారి కార్యక్రమాల్లో భాగంగా సోమవారం జిల్లాలోని అన్ని కళాశాలల్లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి అసెంబ్లీ నిర్వహించాలని సూచించారు. చిత్రలేఖన, వ్యాస రచన, డిబేట్, క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందచేయాలన్నారు. జిల్లాస్థాయిలో ఈనెల 11న డీకేడబ్ల్యూ కళాశాలలో జరిగే పోటీల్లో విద్యార్థులు పాల్గొనేలా వారిని సిద్ధం చేయాలని ఆదేశించారు.

ఆన్‌లైన్‌లో ఇంటర్ డూప్లికేట్ పాస్ సర్టిఫికెట్లు

ఇంటర్ డూప్లికెట్ పాస్ సర్టిఫికెట్లు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉన్నాయని ఆర్‌ఐవో పేర్కొన్నారు. తెలిపారు. గతంలో ఎఫ్ఐఆర్ అఫిడవిట్ కాపీలు సమర్పించి ఆలస్యంగా డూప్లికెట్ పాస్ సర్టిఫికెట్ పొందే విధానాన్ని సంస్కరించి ఇకపై ఆన్‌లైన్‌లో పొందే విధానానికి ఇంటర్‌బోర్డు శ్రీకారం చుట్టిందని పేర్కొన్నారు. ఈ విధానం ఈనెల 10 నుంచి అందుబాటులోకి వస్తుందని, విద్యార్థులు apbie.apcfss.in వెబ్‌సైట్‌లోకి వెళ్లి స్వీయ ధ్రువీకరణ పత్రాన్ని అప్‌లోడ్ చేసి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. విలువైన సర్టిఫికెట్లను భద్రపరచుకునేందుకు విద్యార్థులు తమ మొబైల్ ఫోన్‌లో డిజిలాకర్ ఉపయోగించాలన్నారు. 15 ఏళ్ల వయసు దాటిన విద్యార్థులందరూ mybharat.gov.in పోర్టల్‌లో రిజిస్టర్ చేసుకునేలా ప్రిన్సిపాళ్లు చొరవ చూపాలని కోరారు.

ఎస్సీ, ఎస్టీ ఈఏ
సంయుక్త కార్యదర్శిగా ప్రభాకర్


ప్రభాకర్

నెల్లూరు(హరనాథపురం), జనవరి 7 : ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ అసోసియేషన్ జిల్లా సంయుక్త కార్యదర్శిగా కుల్లూరు ప్రభాకర్‌ను నియమిస్తూ అ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మంద బాజ్జి ఆదివారం నియామకపు పత్రం అందచేశారు. ప్రభాకర్ విద్యాశాఖలో సీనియర్ సహాయకుడిగా పనిచేస్తున్నారు.

రమేష్‌పై విచారణాధికారిగా డీఆర్వో

నెల్లూరు(హరనాథపురం), జనవరి 7 : జిల్లా సాంఘిక సంక్షేమ, సాధికారత అధికారి కే రమేష్ కొన్ని వస్తువుల టెండర్లు అనుమతి లేకుండా ఎక్కువ రేటుకు పిలిచారనే ఆరోపణలపై విచారణకు డీఆర్వోను అధికారిగా కలెక్టర్ నియమించారు. ఆ టెండర్లలో అవకతవకలు జరిగాయని జిల్లా దళిత గిరిజన హక్కుల పరిరక్షణ కమిటీ నాయకులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఆయన సాంఘిక సంక్షేమశాఖ రాష్ట్ర ముఖ్య కార్యదర్శి జీ జయలక్ష్మి దృష్టికి తీసుకెళ్లారు. ఈ అంశమై విచారణ జరిపించాలని ఆమె కలెక్టర్‌ను కోరటంతో కలెక్టర్ డీఆర్వో లవన్నను విచారణాధికారిగా నియమించారు.

కోన నిత్యాన్నదాన పథకానికి పలువురి విరాళం


పెంచలకోనలో నిత్యాన్నదాన పథకానికి విరాళం అందచేస్తున్న దాతలు

రాపూరు(డక్కిలి), జనవరి 7 : జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రం అయిన పెనుశిల నృసింహస్వామి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి ఆదివారం పలువురు విరాళాలు అందించినట్లు ఆలయ సహాయ కమిషనర్ కె జనార్దనరెడ్డి తెలిపారు. నెల్లూరుకు చెందిన పెండ్యాల మాలకొండయ్య, మాగుంట పెంచల శ్రీనిక్, మాగుంట పెంచల శ్రీయన్‌లు రూ. 3,03,333 లక్షలు, ఉయ్యారుకు చెందిన బొల్లినేని నవీన్ రూ. 2,00,216 లక్షలు, నాయుడుపేటకు చెందిన ముపాళ్ల మురళీరాజు, సునీతలు నిత్యాన్నదాన పథకానికి 1,00,116 లక్షలు, మరియు దేవస్థానం అభివృద్ధికి మరో 1,00,116 లక్షలు అందచేసినట్లు వివరించారు. విరాళాలు అందించిన దాతలకు స్వామి, అమ్మవార్ల దర్శనం కల్పించి తీర్థప్రసాదాలు అందచేశారు.

వరిణి చెరువు ఆక్రమిత భూముల్లో
వరినాట్లు పీకేసిన ఆయకట్టు దారులు


వరిణి చెరువులో వేసిన వరినాట్లు తొలగిస్తున్న అయకట్టుదారులు

విడవలూరు, జనవరి 7: వరిణి చెరువు లోతట్టు ప్రాంతంలో అనుమతులు లేకుండా అలగానిపాడు గ్రామ రైతులు వేసిన వరినాట్లను రామతీర్థంకు చెందిన అయకట్టుదారులు ఆదివారం తొలగించారు. దీంతో ఆక్రమణదారులకు, అయకట్టుదారులకు మధ్య వాగ్వావాదం జరిగింది. వరిణి చెరువులో అనేక మంది రైతులు వరినాట్లు వేసుకుని ఉన్నారని, వాటిని తొలగించకుండా సన్నకారు రైతులు వేసుకున్న వరినాట్లను తొలగించారని అలగానిపాడుకు చెందిన రైతులు ఆరోపించారు. దీంతో కొద్దిసేపు ఆప్రాంతంలో ఉద్రిక్తత నెలకొంది. రెవెన్యూ, పోలీసులు చేరుకుని ఇరువర్గాల వారిని వారించి అక్కడ నుంచి పంపివేశారు. అనంతరం అయకట్టుదారులు చెరువు ఆక్రమణకు గురికాకుండా జేసీబీతో కట్ట వేశారు. అయితే కట్ట వేయ్యడానికి నీటిపారుదల అధికారులు నుంచి ఎటువంటి అనుమతులు తీసుకోలేదు.


జెండా ఊపి 'జయహో బీసీ' వాహనాలను ప్రారంభిస్తున్న మాజీ మంత్రి నారాయణ, బీద తదితరులు

బీసీల వెన్ను విరిచిన
వైసీపీ ప్రభుత్వం

● సామాజిక యాత్రలతో మభ్యపెట్టే ప్రయత్నం
● టీడీపీ నేతలు నారాయణ, బీద
● జయహో బీసీ వాహనాల ప్రారంభం

నెల్లూరు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : 'వైసీపీ పాలనలో బలహీన వర్గాలపై దాడులు, హత్యలు, భూ ఆక్రమణలు పెరిగిపోయాయి. నాలుగేళ్లలో 74 మంది బీసీలను పొట్టనపెట్టుకు న్నారు. ఐదు వేల మందికిపైగా క్షతగాత్రులయ్యారు. రూ.76 వేల కోట్ల బీసీ సబ్‌ప్లాన్ నిధులను జగన్మోహన్‌రెడ్డి దారి మళ్లించారు. బీసీల వెన్ను విరిచిన వైసీపీ ప్రభుత్వం నేడు సామాజిక యాత్రలంటూ మభ్యపెట్టే ప్రయత్నాలు చేస్తోంది' అంటూ టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర, మాజీ మంత్రి పొంగూరు నారాయణ ధ్వజమెత్తారు. వైసీపీ హయాంలో బీసీలపై జరిగిన దాడులు, బీసీల నిధుల దారి మళ్లింపు వంటి వివరాలతో రూపొందించిన ప్రత్యేక బుక్‌లెట్‌ను ఆదివారం నెల్లూరులోని ఎన్టీఆర్ భవన్‌లో వారు ఆవిష్కరించారు. అనంతరం జయహో బీసీ వాహనాలను ప్రారంభించారు. నారాయణ మాట్లాడుతూ చట్టసభల్లో బీసీలకు అవకాశం కల్పించడం, స్థానిక సంస్థల్లో 34 శాతం రిజర్వే షన్లు కల్పించిన ఘనత తెలుగుదేశం పార్టీకే దక్కుతుం దన్నారు. జగన్ ఇప్పుడు 24 శాతానికి రిజర్వేషన్లు తగ్గించి బీసీలకు అన్యాయం చేశారని విమర్శిం చారు. రవిచంద్ర మాట్లాడుతూ సామా జిక యాత్రలతో హడావిడి చేస్తున్న మంత్రులంతా ఆదరణ, ఇతర బీసీ పథకాలను జగన్మోహన్ రెడ్డి నిలిపేసినప్పుడు ఏమైపోయారని ప్రశ్నించారు. నెల్లూరులో బీసీ భవన్‌కు తాము శంకుస్థాపన చేస్తే అనిల్‌కుమార్ యాదవ్ మంత్రి గా కూడా దానిని పూర్తి చేయలేకపోయారని మండిప డ్డారు. నారాయణ, అచ్చెన్నాయుడు, సోమిరెడ్డి, అజీజ్ పేర్లతో ఉన్న బీసీ భవన్ శిలాఫలకాన్నైతే ధ్వంసం చేశారు కానీ బీసీ భవన్ నిర్మాణం మాత్రం పూర్తి చేయలేకపోయారని ధ్వజమెత్తారు. బీసీలకు రాజ్యాధికారం ఇచ్చే ఏకైక పార్టీ తెలుగు దేశం అని చెప్పారు. ఈ కార్యక్రమంలో పార్టీ నెల్లూరు పార్లమెంటు నియోజకవర్గ అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్, ఎమ్మెల్సీ బీటీ నాయుడు, పరసా వెంకటరత్నం, కోటంరెడ్డి శ్రీనివా సులురెడ్డి, చేజర్ల వెంకటేశ్వర్లురెడ్డి, చెంచలబాబు యాదవ్, ధర్మవరం సుబ్బారావు, కొండూరు పాలిశెట్టి, గంజాం రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

సీఐల బదిలీ

నెల్లూరు(క్రైం), జనవరి 7: గుంటూరు రేంజ్ పరిధిలో పలువురు సీఐలను బదిలీ చేస్తూ ఐజీ పాల రాజు ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. నెల్లూరు దర్గామిట్ట ఇన్‌స్పెక్టర్ బీవీవీ సుబ్బారావును రేంజ్ వీఆర్‌కు బదిలీ చేయగా ఆయన స్థానంలో గుంటూరు జిల్లా పొన్నూరు పట్టణ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న ఖాజా అల్తాఫ్‌హుస్సేన్‌ను నియమించారు. పల్నాడు జిల్లా చిలకలూరిపేట రూరల్ సీఐగా పనిచేస్తున్న బీ అశోక్‌కుమార్‌ను చిన్నబజారు పోలీసుస్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా నియమించారు. ఆయన ఇటీవలే చిన్నబజారు స్టేషన్ నుంచి బదిలీపై వెళ్లారు. ఆ స్థానంలో ఎవరూ రాకపోవడంతో మళ్లీ అశోక్‌కుమార్‌ను నియమించారు.

పింఛన్ల పంపిణీలో
ఎస్సీ మహిళా సర్పంచుకు అవమానం

చేజర్ల, జనవరి 7: పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో అధికార పార్టీ నాయకుల చేతిలో ఎస్సీ మహిళా సర్పంచికు తీవ్ర అవమానం జరిగింది.ఈ సంఘటన చేజర్ల మండలం పాడేరు సచివాలయ పరిధిలోని గొల్లపల్లి పంచాయతీ ఎస్సీ కాలనీలో ఆదివారం చోటుచేసుకుంది. పూర్తి వివరాల మేరకు... గొల్లపల్లి పంచాయతీలోని తూర్పు ఎస్సీ కాలనీలో పింఛన్లు పంపిణీ చేసేందుకు వచ్చిన గ్రామ సర్పంచి వెండిపల్లి జయంతి సదరు లబ్ధిదారుడికి పింఛన్ నగదు ఇస్తుండగా అక్కడకు చేరుకున్న వైసీపీ సచివాలయ కన్వీనర్ బొరిగర్ల రామచంద్రయ్య ఆమెను అడ్డుకుని నువ్వేంటి పంచేది... అంటూ సర్పంచి చేతిలో ఉన్న నగదు లాక్కున్నాడు. ఈ సందర్భంగా సర్పంచి వెండిపల్లి జయంతి మాట్లాడుతూ తనను అవమానపరిచారని, ఈ విషయంపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తానని తెలిపారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు.

రాజ్యాధికార సమానత్వం కోసం ఉద్యమించాలి

● యానాది సంఘాల మహాకూటమి రాష్ట్ర అధ్యక్షుడు చాపట్ల



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటపతి

నెల్లూరు(హరనాథపురం), జనవరి 7 : రాజ్యాధికార సమానత్వం కోసం యానాదులు ఉద్య మించాలని యానాది సంఘాల మహా కూటమి రాష్ట్ర అధ్యక్షుడు చాపట్ల వెంకటపతి పిలుపు నిచ్చారు. ఆదివారం వెన్నెలకంటి రాఘవయ్య భవన్‌లో ఆ కూటమి సమావేశం జరిగింది. వెంకటపతి మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్ని ప్రభుత్వాలు మారినా యానాదులకు న్యాయం జరగటం లేదన్నారు. యానాది కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, ఒక ఎమ్మెల్సీ సీటు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర చైర్మన్ తిరుమలశెట్టి శ్రీనివాసులు, ఉపాధ్యక్షుడు జయంపు కనకయ్య, మహిళా కార్యనిర్వాహక అధ్యక్షురాలు నూతలపాటి జయలక్ష్మి, నాయకు డు ఏలూరు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు. కాగా, ఈ సమావేశంలో నెల్లూరు జిల్లాకు యానాది సంఘాల మహాకూటమి నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కొమరగిరి మహేంద్రబాబు, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా ఇండ్ల సుధాకర్, ఉపాధ్యక్షులుగా పొట్లూరి వెంకటేశ్వర్లు, అల్లూరి నాగేశ్వరరావు, కోవూరు నవీన్‌బాబు, చెలంచర్ల సునీల్, ఈగ సుమన్, ప్రధాన కార్యదర్శిగా సుధీర్, సహాయ కార్యదర్శులుగా గంధళ్ల రమేష్, కొమరగిరి సురేష్, చూపూరు సుబ్బారావు, మల్లిక నాగరాజు, సంయుక్త కార్యదర్శులుగా యాకసిరి శ్రీనివాసులు, కొమరగిరి హరీష్, కొమరగిరి ప్రదీప్, రాగి అంకయ్య, కోశాధికారిగా కత్తి బాలకోటయ్య ఎన్నికయ్యారు.

విద్యుదాఘాతంతో కౌలు రైతు మృతి


మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై శేఖర్‌బాబు

బిట్రగుంట, జనవరి 7: బోగోలు మండలం విశ్వనాథరావుపేట పంచాయతీ కొత్తూరు గ్రామం నాగవరపమ్మ ఆలయ సమీపంలో నివాసం ఉంటున్న కౌలు రైతు వనపర్తి కృష్ణమోహన్(54) ఆదివారం విద్యుదాఘాతంతో మృతి చెందాడు. స్థానికులు, పోలీసుల కథనం మేరకు.. నెల్లూరు ధనలక్ష్మీపురంకు చెందిన కృష్ణమోహన్ నాలుగేళ్లుగా 20 ఎకరాల పొలం కౌలుకు తీసుకుని సాగు చేస్తూ కొత్తూరులో నివాసం ఉంటున్నాడు. నాట్లు వేసేందుకు పొలం దున్నుకుంటూ నీటి కోసం మోటార్ వేయబోయే సరికి విద్యుత్ స్తంభంపై జంపర్ కట్ అయినట్లు గుర్తించాడు. జంపర్ వేసే క్రమంలో 11 కేవీ విద్యుత్ తీగ తగిలి స్తంభంపై నుంచి కిందపడ్డాడు. స్తంభంపైన వచ్చిన మంటలు గమనించి పరిసరాల్లో రైతులు, కూలీలు ఘటనా స్థలం చేరే లోపు ఆయన మృతి చెందాడు. దీంతో విద్యుత్ శాఖ అధికారులకు, పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సంఘటనా స్థలానికి చేరుకున్న ఎస్‌ఐ శేఖర్‌బాబు మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం కావలి ఏరియా వైద్యశాలకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు. కృష్ణమోహన్ మృతితో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

'గడప గడప'లో ఎమ్మెల్యేకు చేదు అనుభవం

● ప్రజల తిరుగుబాటు.. వెలిసిన టీడీపీ జెండాలు ● అర్ధాంతరంగా కార్యక్రమాన్ని నిలిపేసిన ఎమ్మెల్యే


ఎమ్మెల్యే ప్రతాప్‌ను నిలదీస్తున్న మహిళలు

కావలి, జనవరి 7: వైసీపీకి కంచుకోటగా ఉన్న గ్రామాల్లో కూడా ప్రజలు ప్రభుత్వంపై తిరుగుబాటు బావుటా ఎగుర వేస్తున్నారు. కావలి రూరల్ మండలం చెన్నాయపాలెంలో ఆదివారం జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న కావలి ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్ రెడ్డిని మా గ్రామానికి రోడ్లు లేవు, లైట్లు లేవని కొందరు, సంక్షేమ పథకాలు తీసేశారంటూ మరి కొందరు నిలదీశారు. అక్కడక్కడ టీడీపీ జెండాలు వెలిశాయి. దీంతో ఎమ్మెల్యే కార్యక్రమం పూర్తి చేయకుండానే వెళ్లిపోగా ప్రారంభోత్సవాల తర్వాత అర్జంట్ పని ఉందని రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు నిరసన సెగలను తప్పించుకుని వెళ్లారు. కావలి ఏఎంసీ చైర్మన్, ఎమ్మెల్యే ముఖ్య అనుచరుడైన సన్నిబోయిన ప్రసాద్ స్వగ్రామమైన చెన్నాయపాలెం వైసీపీకి కంచుకోటగా భావిస్తారు. ఈ గ్రామంలో రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు వర్గం కూడా ఇక్కడ ఉండడం, ఏఎంసీ చైర్మన్ స్వగ్రామం కావడంతో ఆ గ్రామంలో మనకు ఎదురులేదని భావించి గడపగడప చివరి ప్రోగ్రామ్‌ను భారీ ఎత్తున చేయాలని ఆ గ్రామంలో పలు ప్రారంభోత్సవాలను పెట్టుకున్నారు. దానికి రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావును, ఆప్కాబ్ చైర్మన్ కొండూరు అనిల్‌ను కూడా ఆహ్వానించారు. అయితే వైసీపీ ప్రభుత్వంతోపాటు ఏఎంసీ చైర్మన్ ప్రసాద్‌పై కూడా గ్రామస్థులలో వ్యతిరేకత తీవ్రంగా ఉండటంతో దానిని తెలియచేసేందుకు కొందరు తమ ఇళ్ల ముందు టీడీపీ జెండాలు కట్టుకున్నారు. అయితే ఎమ్మెల్యే కార్యక్రమానికి ఆటంకం కలిగించకుండా ఇళ్లకు వచ్చినపుడు ప్రశ్నించాలనుకున్నారు. ఆ పంచాయితీలో మూడు చిన్న చిన్న గ్రామాలు ఉండగా వాటిలో గడపగడపకు తిరుగుతున్నపుడు మహిళలు తమ గ్రామానికి ఏమి చేశావని అడగటం ప్రారంభించారు. ఎమ్మెల్యే అనుచరుడిగా ఉండిన పంతంగి వెంకటేశ్వర్లును ఏఎంసీ చైర్మన్‌ప్రసాద్ పలు రకాలుగా ఇబ్బందులు పెట్టడంతో ఆయన మధ్యలో వైసీపీకి దూరమై ఉన్నారు. ఎమ్మెల్యే తన ఇంటికి వస్తే అన్నీ అడగాలని భావించారు. అయితే ఎమ్మెల్యే చెన్నాయపాలెం ప్రధాన గ్రామంలో మధ్యాహ్న భోజనానికి వెళుతుండగా కొందరు ఎమ్మెల్యేను మా గ్రామానికి ఏమి చేశారని, గత టీడీపీ హయాంలో వేసిన రోడ్లు, లైట్లు తప్ప ఏమి పనులు జరగలేదని నిలదీశారు. మీరు వస్తున్నారని ఒక రోజు ముందు లైట్లు వేశారన్నారు. ఆ సమయంలో గ్రామంలో సీఐతో పాటు పోలీస్‌లు కూడా అధికంగా ఉండటంతో పోలీసులు ప్రశ్నించే గ్రామస్థులను నెట్టి వేయడంతో వారు ఎదురుతిరిగారు. దీంతో ఎమ్మెల్యే గ్రామంలో కొన్ని ఇళ్లకు మొక్కుబడిగా తిరిగి టీడీపీ వర్గీయులు ఉన్నారని భావించిన ఇళ్లను పూర్తిగా వదిలివేసి వెళ్లిపోయారు.

రక్తదాన శిబిరం వద్ద ఘర్షణ

నెల్లూరు రూరల్, జనవరి 7 : నెల్లూరు రూరల్లోని ధనలక్ష్మీపురం వద్ద ఆదివారం నిర్వహించిన రక్తదాన శిబిరం వద్ద ఘర్షణ జరిగింది. ఆటో, స్కూటీ స్వల్పంగా ఢీకొనడంతో ఒకరిపై మరొకరు దాడికి పాల్పడ్డారు. దీంతో స్థానికంగా ఉద్రిక్తత నెలకొంది. సమాచారం అందుకున్న రూరల్ ఎస్‌ఐ లక్ష్మణరావు రంగంలోకి దిగి పలువురిని అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం.

టీడీపీ గెలుపే లక్ష్యంగా పనిచేద్దాం : బొల్లినేని

ఉదయగిరి రూరల్, జనవరి 7: రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ గెలుపే లక్ష్యంగా ప్రతిఒక్కరూ పని చేయాలని మాజీ ఎమ్మెల్యే బొల్లినేని వెంకటరామారావు పిలుపునిచ్చారు. ఆదివారం ఉదయగిరిలోని దిలావర్‌భాయ్‌వీధి, షబ్బీర్‌కాలనీ తదితర ప్రాంతాల్లో బాబు ష్యూరిటీ- భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా ప్రజాదీవెన యాత్ర చేపట్టి ఇంటింటికీ మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేసి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వైసీపీ నాయకులు షేక్‌నాటి సందానీ తన అనుచరులతో టీడీపీలో చేరారు. వారందరికీ పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. తొలుత యువత కేక్ కట్ చేసి 101 టెంకాయలు కొట్టి బొల్లినేనికి ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో అరాచక ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు కలిసొచ్చే నాయకులందర్నీ టీడీపీ ఆహ్వానిస్తుందన్నారు. ముస్లిం సోదరులను మోసం చేసిన సీఎం జగన్‌కు బుద్ధిచెప్పాలన్నారు. ఉదయగిరి పట్టణంలో గత కొన్నిరోజులుగా తాను చేపడుతున్న ప్రజాదీవెన యాత్రలో ప్రజలు అనేక సమస్యలు తన దృష్టికి తీసుకొస్తున్నారన్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే తొలిసారిగా ఉదయగిరి పట్టణ అభివృద్ధికి చర్యలు చేపట్టి సుందరంగా తీర్చిదిద్దుతానన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ బయ్యన్న, నాయకులు రియాజ్, బొజ్జా నరసింహులు, నల్లిపోగు రాజా, నరసింహా, ఓబులరెడ్డి, సందానీ, నజీల్, ఖాన్‌సా, మాబాషా, బొజ్జా నరసింహా, శివకృష్ణ, ఖాదర్‌బాషా, సురేష్, అబ్బయ్యనాయుడు, కలివెల జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ ప్రభుత్వం రైతాంగాన్ని విస్మరించింది

కొండాపురం: వైసీపీ ప్రభుత్వం రైతాంగాన్ని పూర్తిగా విస్మరించిందని ఉదయగిరి మాజీ ఎమ్మెల్యే బొల్లినేని వెంకట రామారావు పేర్కొన్నారు. మండలంలోని సాయిపేటకు ఆదివారం వచ్చిన బొల్లినేని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోమశిల ఉత్తర కాలువను పూర్తిచేసి మండలంలోని చివరి గ్రామాలైన సాయిపేట, కొమ్మి తదితర చెరువులకు నీరందించి రైతులను ఆదుకున్న ఘనత తెలుగుదేశం ప్రభుత్వానికే దక్కిందన్నారు. సోమశిల జలాశయంలో నీరున్నా ఉత్తరకాలువకు నీరు తీసుకురాకుండా రైతులను నిలువునా వైసీపీ ప్రభుత్వం మోసం చేస్తుందన్నారు. ప్రతిపక్ష నాయకులపై అక్రమ కేసులు పెట్టడానికే ఉదయగిరి వైసీపీ ఇన్‌చార్జి తన సమయాన్ని కేటాయిస్తున్నాడే తప్ప రైతుల అవసరాలు తీర్చడంలో శ్రద్ధ చూపడం లేదన్నారు. త్వరలో జరగనున్న ఎన్నికలలో ఉదయగిరి ఎమ్మెల్యేగా తనను ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడును గెలిపించుకుంటేనే రాష్ట్ర ప్రజలకు మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు పార్లమెంటు అధికార ప్రతినిధి యారవ క్రిష్ణయ్య, క్లస్టర్ ఇన్‌చార్జి సీహెచ్.వెంకటాద్రి, టీడీపీ నాయకులు మహేష్, కుంకు మోహనరావు, వల్లూరు వెంకటేశ్వర్లు, చాగంటి క్రిష్ణ, మామిళ్లపల్లి వెంకట రమణయ్య, గద్దె రాఘయ్య, కుమ్మర వెంకటరావు, పదర్ల తిమోతి పాల్గొన్నారు.



టీడీపీ కండువాలు వేసుకున్న నాయకులతో మాజీ ఎమ్మెల్యే బొల్లినేని వెంకటరామారావు

ఘనంగా పోలేరమ్మకు పొంగళ్లు

వరికుంటపాడు, జనవరి 7: మండలంలోని గొల్ల పల్లిలో ఆదివారం గ్రామదేవత పోలేరమ్మకు గ్రామస్థులు భక్తిశ్రద్ధలతో పొంగళ్లు నిర్వహించారు. గ్రామానికి చెందిన గంగవరపు పుల్లయ్య ఆధ్వర్యంలో గ్రామస్థులు నివాసాల నుంచి ఊరేగింపుగా నైవేద్యాలను ఆలయానికి చేర్చి పాల పొంగళ్లు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. ప్రత్యేక పూజలు చేసి ప్రసాదాలను పంచిపెట్టారు.



పింఛన్ల పంపిణీ



లబ్ధిదారుడికి పింఛన్ అందజేస్తున్న మేకపాటి

ఉదయగిరి రూరల్, జనవరి 7: స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ఆదివారం పింఛన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఉదయగిరి నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైసీపీ టీచర్స్ అసోసియేషన్ డైరీ, క్యాలెండర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ మోడి రామాంజనేయులు, మండల వైసీపీ కన్వీనర్ జీ ఓబులరెడ్డి, జడ్పీ కోఆప్షన్ సభ్యుడు తాజుద్దీన్, మాజీ ఎంపీపీ చేజర్ల సుబ్బారెడ్డి, వైస్ ఎంపీపీ మట్ల శాంతి, సర్పంచ్ గౌస్‌మొహిద్దీన్, నాయకులు అక్కి భాస్కర్‌రెడ్డి, జీ తిరుపతి, యస్థానీ, మట్ల లక్ష్మయ్య రామయ్య, ఎంపీడీవో ఈశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

పూర్తికాని పింఛన్ల పంపిణీ

● ఆందోళనలో లబ్ధిదారులు

చేజర్ల, జనవరి 7: నెల ప్రారంభమై వారం రోజులు గడుస్తున్నా ఇంకా పలువురికి పింఛన్ నగదు అందలేదని, పట్టించుకునే నాథుడే కరువయ్యాడని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 7వ తేదీ గడిచిపోయినా పింఛన్ నగదు అందకపోవడంతో వృద్ధులు, వితంతువులు, కులవృత్తుల వారు ఆందోళన చెందుతున్నారు. అయితే పూర్తిస్థాయిలో పింఛన్ నగదు రాకపోవడంతోనే కొంతమందికి పింఛన్ పంపిణీ చేయలేదని వాలంటీర్లు తెలపుతున్నారు. సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్లు ఇచ్చిన నగదు పంపిణీ చేశామని, అయితే గతంలో ఇచ్చిన మాదిరిగా పూర్తిస్థాయిలో నగదు ఇవ్వలేదని, ఈ నేపథ్యంలోనే కొంతమందికి పింఛన్ పంపిణీ చేయలేదని వారు పేర్కొంటున్నారు. అయితే మిగిలినవారికి సోమవారం పంపిణీ చేస్తామని మండల అధికారులు పేర్కొంటున్నారు.

ప్రమాదకరంగా రోడ్డు మార్జిన్లు



ప్రమాదకరంగా మారిన మార్జిన్లు

వరికుంటపాడు, జనవరి 7: మండల కేంద్రమైన వరికుంటపాడు నుంచి జీ.కొండారెడ్డిపల్లి వరకు నిర్మించిన తారురోడ్డు నిర్మాణంలో భాగంగా ఇటీవల వరికుంటపాడు, తూర్పుబోయమడగల గ్రామాల సమీపంలో సిమెంటు రోడ్డు నిర్మాణం చేపట్టారు. దీంతో రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు ఉండవని సంబరపడిన ప్రజలు, వాహనదారులకు నిరాశే మిగిలింది. రహదారికి ఇరువైపులా నాణ్యతలేని మట్టిని మార్జిన్లుగా వేయడంతో ప్రమాదాలకు నిలయంగా మారింది. ఏమాత్రం చదును చేయకుండా అలాగే వదిలి వేయడంతో అటుగా ప్రయాణాలు సాగిస్తున్న వాహనదారులు రోడ్డు దిగితే ఎక్కడ జారిపడతామోనని బెంబేలెత్తిపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ప్రమాదాలు జరుగక ముందే తగిన చర్యలు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.

గ్యాస్ కనెక్షన్ల పంపిణీ

మర్రిపాడు, జనవరి 7: ప్రధానమంత్రి ఉజ్వల యోజన పథకం ద్వారా మంజూరైన 120 గ్యాస్ కనెక్షన్లను ఆదివారం లబ్ధిదారులకు బీజేపీ ఆత్మకూరు నియోజకవర్గం ఇన్చార్జి కంది మల్లికార్జున రెడ్డి అందజేశారు. పేదరిక నిర్మూలనకు కేంద్ర ప్రభుత్వ కృషి చేస్తోందని, రాష్ట్రంలో ప్రతీ అభివృద్ధి పనిలో కేంద్ర ప్రభుత్వం భాగస్వామ్యమై తనవంతు ఆర్థికంగా తోడ్పడుతోందని ఆయన తెలిపారు.

అలరించిన సంక్రాంతి పోటీలు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న కంచి పరమేశ్వరరెడ్డి దంపతులు

ఆత్మకూరు, జనవరి 7: సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కంచి పరమేశ్వరరెడ్డి సౌజన్యంతో తెలుగు భారతి సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన సంక్రాంతి పోటీలు అలరించాయి. పట్టణంలోని అలఘనాథస్వామి ఆలయం సమీపంలోని రైస్‌మిల్లు ఆవరణలో తెలుగు సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించేలా ముగ్గులు, కోలాటం, సంక్రాంతి లక్ష్మీ, కర్రసాము, కుస్తీ పోటీలు జరిగాయి. ముగ్గుల పోటీల్లో బి భాగ్యలక్ష్మీ, టి సుజాత, బి సుజాత ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలను కైవసం చేసుకున్నారు. వీరితో పాటు ప్రతిభ కనపరిచిన మరో 19 మందిని ప్రత్యేక ప్రోత్సాహక బహుమతులకు ఎంపిక చేశారు. కోలాటం పోటీల్లో వాసవీమాత గ్రూపు, నాయుడువీధి గ్రూపు, ప్రభుత్వ ఉన్నత పాఠశాల బాలికల గ్రూపు విజేతలుగా నిలిచారు. పండరిభజన పోటీల్లో నాయుడువీధి గ్రూపు, ముగ్గుల పోటీలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల బాలికల గ్రూపు విజేతలుగా ఎంపికయ్యారు. అనంతరం సోమవరపు సుబ్బరాయుడు అధ్యక్షతన అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కంచి పరమేశ్వరరెడ్డి దంపతులు విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు పట్టణ ప్రముఖులు, ప్రజాప్రతినిధులు, తెలుగు భారతి సేవా సమితి నేతలు పాల్గొన్నారు.

చెకుముకి పోటీల్లో లుంబినీ విద్యార్థుల ప్రతిభ

చేజర్ల, జనవరి 7: కావలి విశ్వోదయ బాలుర పాఠశాలలో ఆదివారం పసుపులేటి సుధాకర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి ప్రయివేటు పాఠశాలల విభాగంలో నిర్వహించిన చెకుముకి పోటీలలో స్థానిక లుంబినీ విద్యాలయానికి చెందిన కె కృష్ణకౌశిక్, బి సిందుహాసిని, యుహేమతేజ జిల్లాస్థాయిలో ద్వితీయ స్థానాలను కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా వారిని పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

వైద్యఖర్చులకు ఆర్థిక సాయం



నగదు అందజేస్తున్న ట్రస్టు సభ్యులు

ఉదయగిరి రూరల్, జనవరి 7: మండలంలోని జీ.చెరువుపల్లి గ్రామానికి చెందిన అనంతరాజు రామరాజు అనే వ్యక్తి అనారోగ్యంతో బాధపడుతుండడంతో ఆదివారం మాజీ ఏఎంసీ చైర్మన్, మన ఫౌండేషన్ అధినేత మన్నేటి వెంకటరెడ్డి తన ప్రతినిధులచే రూ.10 వేలు నగదు అందజేశారు. రామరాజు గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న విషయాన్ని స్థానికులు మన ఫౌండేషన్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో వారు స్పందించి నగదు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కప్పా శ్రీనివాసులు, ట్రస్టు ప్రతినిధులు గాజుల రంతుజానీ, భోగ్యం శ్రీనివాసులు, గ్రామస్థులు చిరంజీవులు, వెంకటసుబ్బయ్య, టీఎన్ఎస్ఎఫ్ నాయకులు ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

వినియోగంలోకి రాని పీహెచ్‌సీ భవనం



వినియోగంలోకి రాని పీహెచ్‌సీ భవనం

అనంతసాగరం, జనవరి 7: మండల కేంద్రం అనంతసాగరంలోని పీహెచ్‌సీ భవనం నాడు- నేడు కింద అభివృద్ధి పరిచేలా ఏడాది క్రితం అధికారులు చర్యలు చేపట్టారు. రూ. 35 లక్షలతో పనులు పూర్తిచేసేలా పనులు ప్రారంభం కాగా ఇంతవరకు పనులు పూర్తికాలేదు. దీంతో భవనం వినియోగంలోకి రాని కారణంగా ఆసుపత్రికి వచ్చే రోగులు, వైద్యసిబ్బంది అవస్థలు పడుతున్నారు. వసతులు కరువై పీహెచ్‌సీ ప్రాంగణంలోని అతిథి భవనంలో తాత్కాలికంగా వైద్యసేవలు అందిస్తుండడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. అక్కడే మందులు నిల్వ చేసుకోవడం, రోగులకు పరీక్షలు చేయాల్సిన పరిస్థితితో అసౌకర్యం నెలకొంది. ఇక పీహెచ్‌సీలో నీటి వసతి లేక ఇబ్బందులు పడుతున్నారు. ఇకనైనా ఉన్నతాధికారులు దృష్టిసారించి నాడు- నేడు పనులు పూర్తి చేసి ఆసుపత్రి భవన సముదాయం వినియోగంలోకి తెచ్చేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ట్రాఫిక్ చక్రబంధంలో ఉదయగిరి

వాహనదారుల అవస్థలు



రహదారిపైనే లారీలు నిలిపి సరుకులు దించుతున్న కూలీలు

ఉదయగిరి రూరల్, జనవరి 7: నియోజకవర్గ కేంద్రమైన ఉదయగిరి పట్టణంలో ప్రధానంగా పంచాయతీ బస్టాండ్ సెంటర్, మెయిన్‌బజార్, గండిపాళెం మార్గంలో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉండడంతో ప్రజలు, వాహనదారుల అవస్థలు వర్ణనాతీతంగా మారాయి. పార్శిల్, ఇతర సరుకులు తీసుకొచ్చే వాహనాలు ఎక్కడపడితే అక్కడ నిలిపివేసి సరుకులు దించుతుండడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. పంచాయతీ కూరగాయల మార్కెట్‌లో వ్యాపారుల మధ్య విబేధాలు రావడంతో వారంతా మెయిన్‌బజార్, ఇతర ప్రాంతాల్లో తోపుడుబండ్లపై కూరగాయలు విక్రయిస్తూ రాకపోకలకు ఇబ్బందులు కలిగిస్తున్నారు. దుకాణాలకు వచ్చిన వారు తమ వాహనాలను రోడ్డుపైనే నిలపడంతో ట్రాఫిక్ స్తంభించి రాకపోకలు సాగించేందుకు అవస్థలు పడాల్సి వస్తోందని ప్రజలు వాపోతున్నారు.

నిలువ నీడ కరువాయే: పంచాయతీ బస్టాండ్ సెంటర్‌లో ఉన్న ప్రయాణికుల విశ్రాంతి భవనం వివిధ పార్టీల ఫ్లెక్సీలు, జెండాల దిమ్మెలతో మూసుకుపోయింది. మరోవైపు భవనం శుభ్రత గురించి అధికారులు పట్టించుకోకపోవడంతో అందులో సేదతీరేందుకు ప్రయాణికులు వెళ్లాలంటే భయపడుతున్నారు. దీంతో బస్సుల కోసం వేచి ఉండే ప్రయాణికులు ఎండలో ఆరుబయట, దుకాణాల్లో వేచి ఉండాల్సిన దుస్థితి నెలకొంది. ఇప్పటికైనా అధికారులు ట్రాఫిక్ సమస్య పరిష్కరించి విశ్రాంత భవనం ప్రయాణికులకు అందుబాటులో ఉండేలా తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.

శేషసాయినాథుడికి ప్రత్యేక పూజలు

బిట్రగుంట: బోగోలు మండలం బిట్రగుంట ద్వారాక నగరులో వెలసి ఉన్న షిరిడీ శేష సాయినాథునికి ఆదివారం ప్రత్యేక పూజలు, నగర సంకీర్తన, హారతి కార్యక్రమాలు జరిగాయి. కే.సుధాకర్, ధనసూర్యావతి దంపతులు అన్నసంతర్పణ చేశారు. మందిర వ్యవస్థాపకుడు కే.బ్రహ్మానందం, భక్తులు పాల్గొన్నారు.

పొర్లు దండాలతో మున్సిపల్ కార్మికుల నిరసన

కావలి, జనవరి 7: మున్సిపల్ కార్మికులు తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన సమ్మెలో భాగంగా ఆదివారం మున్సిపల్ కార్యాలయం వద్ద కార్మికులు సమ్మెను కొనసాగించారు. సీఐటీయూ అనుబంధ కార్మికులు 13 రోజులుగా ఏఐటీయూసీ అనుబంధ కార్మికులు 5 రోజులుగా సమ్మె చేస్తున్నారు. ఇద్దరూ రెండు శిబిరాలుగా మున్సిపల్ కార్యాలయం వద్ద టెంట్‌లు వేసుకుని సమ్మెలో కూర్చున్నారు. సీఐటీయూ అనుబంధ కార్మికులు పొర్లు దండాలతో ప్రభుత్వానికి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు కార్మికులు తమ న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం నాలుగున్నర సంవత్సరాలకు పైగా ఎదురు చూసి పరిష్కారం కోసం చివరకు సమ్మె చేపట్టాల్సి వచ్చిందన్నారు. ఇప్పటికైనా రాష్ట్రప్రభుత్వం కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని అప్పటి వరకు సమ్మెను కొనసాగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ గౌరవాధ్యక్షుడు పసుపులేటి పెంచలయ్య, యూనియన్ నాయకులు తురక శీనయ్య, బిడదల మహేష్, బాబు, పోలయ్య, చిన్నమ్మ, జ్యోతి, నారాయణమ్మ, సునీత, వెంకమ్మ, సీపీఐ కావలి నియోజకవర్గ కార్యదర్శి కొప్పర్తి నాగరాజు, ఏఐటీయూసీ అనుబంధ మున్సిపల్ యూనియన్ నాయకులు గుంజి కిషోర్, ఏలూరు ఆదినారాయణ, తన్నీరు వెంకటేష్, వై. రాజేష్, పద్మ, లక్ష్మమ్మ, అంకయ్య, తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల భిక్షాటన

ఆత్మకూరు, జనవరి 7 : సమస్యల పరిష్కారం కోసం మున్సిపల్ కార్మికులు చేప ట్టిన సమ్మె ఆదివారం కొన సాగింది. వారు తమ విధు లను బహిష్కరించి స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదు ట సీఐటీయు, ఏఐటీయుసీ ఆధ్వర్యంలో పట్టణంలోని ప్ర ధాన రహదారి వెంబడి భిక్షాటన చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. వీరికి మద్దతుగా సీపీఎం, సీఐటీయు నాయకులు నిరసనలో పాల్గొని తమ సంపూర్ణ మద్దతు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూరాష్ట్ర ప్రభుత్వం ఉదాసీనతను వీడి తక్షణం సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం, సీఐటీయు నాయకులు కె డేవిడ్‌రాజు, జి లక్ష్మీపతి, ఆత్మకూరు నాగయ్య, కొండమూరి హజరత్తయ్య, మున్సిపల్ యూనియన్ నాయకులు, పలువురు మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.



ఆత్మకూరు : భిక్షాటన చేస్తూ నిరసన వ్యక్తం చేస్తున్న మున్సిపల్ కార్మికులు

మాయదారి జగన్ మాకొద్దు : ఇంటూరి



కరపత్రాలు పంపిణీ చేస్తున్న నాగేశ్వరరావు

లింగసముద్రం, జనవరి 7 : రాష్ట్రాన్ని వెనక్కు తీసుకెళుతున్న జగన్మోహన్‌రెడ్డి మనకు వద్దని, ముందు చూపుతో అభివృద్ధి చేయగల సత్తా ఉన్న చంద్రబాబునాయుడును మళ్లీ ముఖ్యమంత్రిగా తెచ్చుకుందామని కందుకూరు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జ్ ఇంటూరి నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. ఆదివారం రాత్రి లింగసముద్రం పంచాయతీ జంపాలవారిపాలెంలో టీడీపీ మండల అధ్యక్షుడు వేముల గోపాలరావు ఆధ్వర్యంలో నిర్వహించిన బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో ఇంటూరి నాగేశ్వరరావు పాల్గొని ఇంటింటికి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షుడు అంగులూరి నరసింహారావు, టీడీపీ నాయకులు గాలంకి ప్రసాద్, జంపాల కృష్ణయ్య, జంపాల శివప్రసాద్, మక్కెన వెంకటేశ్వర్లు, జంపాల మహేష్, తోపూరి నరసింహం, తదితరులు పాల్గొన్నారు.

కమ్మ సేవాసమితి సంక్రాంతి సంబరాలు



అతిథులకు పుష్పగుచ్ఛం అందచేస్తున్న నిర్వాహకులు

కావలి రూరల్, జనవరి 7: కావలి పట్టణంలోని మాల్యాద్రి లక్ష్మీనరసింహ స్వామి ఆలయం లోని బొల్లినేని చెంచయ్యనాయుడు సభా ప్రాంగణంలో ఆదివారం కమ్మ సేవా సమితి సంక్రాంతి సంబరాలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా మాజీ ఎమ్మెల్యేలు కొమ్మి లక్ష్మయ్యనాయుడు, బొల్లినేని వెంకటరామారావు, టీడీపీ కావలి నియోజకవర్గ ఇన్‌చార్జి మాలేపాటి సుబ్బానాయుడు, ఏపీ కేఎస్ఎస్ జనరల్ సెక్రటరీ బెజవాడ వెంకట్రావ్, సెక్రటరీ వెలగా కోటేశ్వరరావు, గ్రీన్ హోమ్స్ ప్రయివేట్ లిమిటెడ్ ఎండీ బొల్లినేని హజరత్ నాయుడు, హరిబాబు, తమిళనాడు, తెలంగాణ, ఒడిశా రాయ్‌ఘడ్‌కు చెందిన కమ్మసంఘం సభ్యులు వి.మోహన్, ధన్‌పాల్ నాయుడు, కండెపనేని రత్నాకర్‌రావు, పర్వతనేని పట్టాభిరామ్ పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ ఐకమత్యంతో అందరూ కలసిమెలసి ఉండి కమ్మ నిరుపేద విద్యార్థులకు, ఇతర కులాలల్లోని నిరుపేద విద్యార్థులకు తమవంతు సహాయ సహకారాలు అందించాలన్నారు. అనంతరం సభాప్రాంగణంలో టీడీపీ నేత మాలేపాటి భాను ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. చిన్నారుల నృత్య ప్రదర్శన, పాటకచ్చేరి, గంగిరెద్దుల ప్రదర్శనతో పాటు సంక్రాంతి శోభ ఉట్టిపడేల భోగి మంటలతో సంబరాలు అంబరాన్ని అంటాయి. ఈ కార్యక్రమంలో కమ్మ సేవాసమితి అధ్యక్షుడు మాకినేని మాల్యాద్రి నాయుడు, సభ్యులు కూరపాటి రమేష్, గద్దం శ్రీనివాసరావు, దివి రమణయ్య, ఏ.వెంకటేశ్వరరావు, సుందరయ్యనాయుడు, చల్లా వెంకటేశ్వర్లు, మంచాల ప్రసాద్, రాజ్‌కుమార్ చౌదరి, గుత్తికొండ కిషోర్, బొట్లగుంట మాల్యాద్రినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

పోలేరమ్మ జాతర తరువాత పైపులైన్ మరమ్మతులు



మంచినీటి పైపులైన్ మరమ్మతుల కోసం సిద్ధం చేస్తున్న పైపులు

కావలి, జనవరి 7: పట్టణంలోని వెంగళరావునగర్‌లో విద్యుత్ సబ్‌స్టేషన్‌కు ఎదురుగా గతంలో పగిలి తాత్కాలిక మరమ్మతులతో నీటి సరఫరా జరుగుతున్న పైపులైనుకు పోలేరమ్మ జాతర ముగిసిన వెంటనే శాశ్వత మరమ్మతులు చేపట్టనున్నట్లు మున్సిపల్ అధికారులు తెలిపారు. కావలి-ఉదయగిరి జాతీయరహదారి క్రాసింగ్ చేస్తూ వేసిన ఈ పైపులైన్ మరమ్మతుల కోసం 6 నెలల కిందట రోడ్డును తవ్వి పైపులైన్‌కు తాత్కాలిక మరమ్మతులు చేపట్టి దానిని పూడ్చకుండా వదిలేశారు. దానివలన ప్రమాదాలు జరిగే పరిస్థితి ఏర్పడటమే కాక వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతుండటంతో అనేక పర్యాయాలు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అయితే అక్కడ ఇనుప పైపులైన్‌ను శాశ్వతంగా ఏర్పాటు చేసేందుకు అనువుగా టెండర్లు పిలిచి పైపులు తెప్పించారు. అక్కడ పైపులైన్‌కు మరమ్మతులు చేపడితే కావలి పట్టణానికి తాగునీటి సరఫరా ఆగిపోయే ప్రమాదం ఉన్నందున పాతూరులోని నడివీధి పోలేరమ్మ జాతర ముగిసిన తర్వాత మరమ్మతులు చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు.

పింఛన్ల పంపిణీ

కొండాపురం, జనవరి 7: స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఆదివారం జరిగిన సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఉదయగిరి నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి మేకపాటి రాజగోపాలరెడ్డి పాల్గొని లబ్ధిదారులకు పింఛన్ నగదు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల పరిధిలో 5558 మంది లబ్ధిదారులు అన్ని రకాల పింఛన్లు పొందుతున్నారన్నారు. కాఆగా 242 మందిని పింఛన్‌కు అర్హులుగా తేల్చినప్పటికీ కేవలం 134 మందికే నూతన పించ న్లు మంజూరయ్యాయి. అలాగే అన్ని పంచాయతీల పరిధిలో 1344 మంది రైతులకు 2830 ఎకరాల అసైన్డ్ భూముల పట్టాలు అందచేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బొడ్డు అనూరాధ, తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీవో ఎమ్.బ్రహ్మయ్య, వైసీపీ మండల కన్వీనర్ రవీంద్ర, నాయకులు కర్తం శ్రీనివాసులురెడ్డి, యారవ నరసింహారావు, బంకా మాల్యాద్రి, తదితరులు పాల్గొన్నారు.

13న వర్ణయుగం, దమనకాండ పుస్తకాల ఆవిష్కరణ

కందుకూరు, జనవరి 7: ప్రముఖ కవి డాక్టరు బద్ధిపూడి జయరావు రచించిన వర్ణయుగం, దమనకాండ పుస్తకాలు ఈనెల 13న సాయంత్రం 4 గంటలకు స్థానిక జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో ఆవిష్కరిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ మేరకు రచయితతో కలిసి వివిధ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు ఆదివారం సాయంత్రం పుస్తకాల ఆవిష్కరణ కరపత్రికలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి రామన్ మెగసెసే అవార్డు గ్రహీత బెజవాడ విల్సన్, సినీ దర్శకుడు ఈ.ప్రేమ్‌రాజ్ పాల్గొంటారని తెలిపారు. కవులు, కళాకారులు, మేధావులు, విద్యావంతులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

ఎమ్మెల్యే మహీధర్‌రెడ్డి ఏ పార్టీలో పోటీ చేసినా ఓడిస్తాం

లింగసముద్రం, జనవరి 7 : కందుకూరు ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి ఏ పార్టీ నుంచి పోటీ చేసినా ఓడిస్తామని వైసీపీ అసమ్మతి నేతలు స్పష్టం చేశారు. ఆదివారం మండలంలోని పెదపవనిలో ఆ పార్టీ సీనియర్ నాయకుడు మలిశెట్టి మాల్యాద్రి నివాసంలో మాజీ ఎంపీపీ డాక్టర్ కేపీ నరసింహారావు అధ్యక్షతన నియోజకవర్గంలోని 5 మండలాలకు చెందిన సీనియర్ నాయకులు సుంకరి చెంచురామిరెడ్డి, సూరం చిరంజీవిరెడ్డి, దామా ప్రవీణ్, పీ.సుబ్బారెడ్డి, పీ.ప్రకాశరావు, ఎస్ఎం బాషా, జీ.వెంకటేశ్వర్లు తదితరులు మాట్లాపాల్గొని మాట్లాడారు. ఆది నుంచి పార్టీ జెండా మోసిన కార్యకర్తలకు ఎమ్మెల్యే అన్యాయం చేశారన్నారు. కేవలం తన సొంత గ్రూపులో వారికి పనులు చేసుకొని పదవులన్నీ కట్టబెట్టారని మండిపడ్డారు. ఆయనను ఓడించేందుకు ప్రణాళిక రూపొందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ అసమ్మతి వాదులు పాల్గొన్నారు.

ప్రభుత్వానికి గుణపాఠం తప్పదు

● ఎస్మా జీవో ప్రతులను దహనం చేసిన అంగన్‌వాడీలు

కావలిటౌన్, డిసెంబరు 7: ప్రభుత్వానికి తగిన గుణపాఠం తప్పదని అంగన్వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ నేతలు హెచ్చరించారు. ఆదివారం అంగన్వాడీల నిరసన శిబిరంలో ఎస్మా ప్రతులను తగులబెట్టారు. యూనియన్ నేతలు రఘురావమ్మ, విజయలతలు మాట్లాడుతూ అంగన్వాడీల సమ్మె 27 రోజులకు చేరుకుందన్నారు. సానుకూలంగా స్పందించాల్సిన ప్రభుత్వం కవ్వింపు చర్యలకు పాల్పడుతూ ఎస్మా చట్టం ఉపయోగించడం దుర్మార్గమన్నారు. దీంతో ముఖ్యమంత్రి జగన్‌కు మహిళ పట్ల ఆయనకున్న గౌరవం అర్థమవుతుందన్నారు. తాము గొంతెమ్మ కోర్కెలు కోరడం లేదని, ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలు అమలు చేయాలని మాత్రమే కోరామని తెలిపారు. ఎన్నికలప్పుడు ఒకలాగా అధికారంలోకొచ్చాక మరోలా ముఖ్యమంత్రి ప్రవర్తిండం అన్యాయమని, పైగా తమపై రకరకాల నిర్బంధాలు విధించడం వేధించడం దుర్మార్గమన్నారు. ఎస్మాకు భయపడమని, సమ్మె కొనసాగిస్తామన్నారు. యూనియన్ నేతలు కళావతి, రజిత, బిందు, జయంతి, పద్మకుమారి, సీఐటీయూ నేతలు పెంచలయ్య, నరహరి తదితరులు పాల్గొన్నారు. కాగా యూటీఎఫ్ జిల్లా నేతలు చలపతిశర్మ, ఎస్‌కె గౌస్‌బాషా, శ్రీదేవి తదితరులు అంగన్వాడీల సమ్మె శిబిరంలో పాల్గొని తమ మద్దతు తెలిపారు.

అంబేడ్కర్ స్మృతి కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

కందుకూరు, జనవరి 7: భారతరత్న, రాజ్యాంగ నిర్మాత డాక్టరు బీఆర్ అంబేడ్కర్ 125 అడుగుల విగ్రహం ఆవిష్కరణ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన అంబేడ్కర్ స్మృతి కార్యక్రమాల్లో భాగంగా కందుకూరులో నిర్వహించే కార్యక్రమాలను విజయవంతం చేయాలని దళిత బహుజన అంబేడ్కర్ బుద్ధిస్ట్ సాహిత్య సాంస్కృతిక సంస్థల ప్రతినిధులు శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 8న అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించటంతో స్మృతి కార్యక్రమాలను ప్రారంభమవుతాయని తెలిపారు. 9న స్థానిక సబ్ కలెక్టరు కార్యాలయం వద్ద అంబేడ్కర్ - సామాజిక న్యాయం అనే అంశంపై చర్చా కార్యక్రమం, వివిధ పోటీలు, 10న రక్తదాన శిబిరం, 12న ఐక్యతా సమభావం ప్రతిబింబించే విధంగా మానవహారం నిర్వహించనున్నట్లు ఆయాసంస్థల ప్రతినిధులు ముప్పవరపు కిషోర్, పోకూరి కోటయ్య, గాండ్ల హరిప్రసాద్, గేరా చిరంజీవి తదితరులు తెలిపారు.

కరసేవకులకు సన్మానం



కరసేవకులను సత్కరిస్తున్న బీజేపీ నాయకులు

కందుకూరు, జనవరి 7: అయోధ్యలో రామమందిరం కోసం 1990, 92లలో అక్కడకు వెళ్లిన కరసేవకులకు మందిరం సాకారమైన సందర్భంగా ఆదివారం కందుకూరులో బీజేపీ నాయకులు ఘనంగా సన్మానించారు. పట్టణంలోని పెద్దబజారు కోదండరామాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎస్.వంశీధర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి యశ్వంత్‌సింగ్‌లు పాల్గొని కరసేవకులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో స్థానిక బీజేపీ నాయకులు సుధాకర్‌రెడ్డి, వంశీకృష్ణనాయుడు, మన్నేపల్లి వరప్రసాదరావు, రాఘవులు, గట్టుమనేని హరిబాబు, ముప్పల భూషయ్య, సురేష్, పాండురంగయ్య తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

కావలి, జనవరి 7: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం కావలి తాలూకా యూనిట్ ఆధ్వర్యంలో ఆ సం ఘం 2024 నూతన క్యాలెండర్‌ను ఆదివారం కావలి ఏరి యా వైద్యశాలలో ఆవిష్కరించారు. ఆ సంఘం కావలి తా లూకా యూనిట్ ప్రెసిడెంట్ నాగిశెట్టి శ్రీనివాసరావు అధ్యక్ష తన జరిగిన ఈ కార్యక్రమంలో సంఘంలోని సభ్యులంద రూ హాజరవగా ఆ సంఘం మహిళా కార్యవర్గ సభ్యులచే క్యాలెండర్ ఆవిష్కరించి నూతన సంవత్సరం నుంచి చేప ట్టాల్సిన కార్యక్రమాలపై చర్చించారు. అనంతరం సంఘ సభ్యులకు క్యాలెండర్లను పంపిణీ చేశారు.



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఉద్యోగులు

నెల్లూరు సిటీ, రూరల్
కోవూరు, సర్వేపల్లి



ఈ రోడ్డుపై నడిచేదెలా?

నెల్లూరు పెన్నా వారధి సమీపం నుంచి పోతిరెడ్డిపాళెం గ్రామానికి వెళ్లే రోడ్డు అధ్వానంగా ఉంది. ఇలాంటి రోడ్డు పై ఎలా నడవాలని, రాకపోకలు సాగించడం ఎలా అంటూ ప్రజలు, వాహన చోదకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ రోడ్డుకు మరమ్మతులు చేయాలని 15 రోజుల కిందట ఎక్స్‌కవేటర్లతో రోడ్డును తవ్వి చదును చేశారు. ఆ తరువాత పనులు చేపట్టడం నిలిపివేశారు. దీంతో పోతిరెడ్డిపాళెం గ్రామానికి రాకపోకలు సాగించాలంటే కష్టతరంగా మారింది. వెంటనే రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలని అధికారులు, ప్రజాప్రతినిధులకు స్థానికులు మొరపెట్టుకుంటున్నారు.

\- కోవూరు

రాష్ట్రాభివృద్ధే చంద్రబాబు ధ్యేయం : దినేష్‌రెడ్డి

● యువత టీడీపీలో చేరిక



టీడీపీలో చేరిన యువతతో దినేష్‌రెడ్డి

కోవూరు, జనవరి 7: రాష్ట్రాభివృద్ధే మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు లక్ష్యమని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పోలంరెడ్డి దినేష్‌రెడ్డి అన్నారు. ఇనమడుగులో ఆదివారం ఆయన ప్రతి అడుగు ప్రజల కోసమే, బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో పాల్గొని అనంతరం ఇంటింటికీ తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక్క అవకాశం పేరుతో ప్రజల్ని మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అన్నివర్గాల ప్రజలను అవస్థలకు గురిచేస్తున్నాడని తెలిపారు. నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు లేకపోవడంతో ఇక్కట్లను ఎదుర్కొంటున్నారని చెప్పారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడ్ని ఎన్నుకుంటే సమస్యలన్నీ పరిష్కారమవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచు కొల్లారెడ్డి వెంకురెడ్డి ఎన్నికల ప్రచార గీతాన్ని ఆవిష్కరించారు. టీడీపీ నాయకులు కొల్లారెడ్డి సుధాకర్‌రెడ్డి, సునీల్‌రెడ్డి, నాపా వెంకటేశ్వర్లు నాయుడు, ఇంతా మల్లారెడ్డి, బాలరవి, నాటకరాని వెంకట్, యాకసిరి వెంకటరమణమ్మ పాల్గొన్నారు.

టీడీపీలో చేరిక : పడుగుపాడులో చెంబేటి పెంచలయ్య ఇంట్లో పెద్దసంఖ్యలో యువకులు పోలంరెడ్డి దినేష్‌రెడ్డి ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. పార్టీలో చేరిన యువకులకు ఆయన కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు చెముకుల కృష్ణచైతన్య, చెంబేటి పెంచలయ్య, చెంబేటి చిన్నయ్య, మసూద్ పాల్గొన్నారు.

సీసీరోడ్లు, మురుగు కాలువలకు కాకాణి ప్రారంభోత్సవం

మనుబోలు, జనవరి 7: మండలంలోని లింగారెడ్డిపల్లి, వీరంపల్లి గ్రామాల్లో మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆదివారం పర్యటించారు. లింగారెడ్డిపల్లి గ్రామంలో సీసీరోడ్లు, మురుగు కాలువలకు ప్రారంభోత్సవం చేశారు. లబ్ధిదారులకు పింఛన్లు, అసైన్‌మెంట్ పట్టాలు అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ హయాంలో డేగపూడి-బండేపల్లి కాలువకు గాని, లింగారెడ్డిపల్లి రోడ్డుకు గాని ఒక్క రూపాయి ఇచ్చినట్లు రుజువుచేస్తే 2024 ఎన్నికల్లో పోటీచేయను.. అంటూ మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డికి సవాల్ విసిరారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌డిఏ పీడీ సాంబశివారెడ్డి, ఎంపీపీ గుండాల వజ్రమ్మ, ఉపాధ్యక్షుడు వెంకటరమణారెడ్డి, ఏఎంసీ చైర్మన్ జెట్టి సురేంద్రరెడ్డి, ఎంపీటీసీ రాగయ్య, సర్పంచు ధనరాశి సుధాకర్, తహసీల్దార్ బి శివకృష్ణయ్య, ఇన్‌చార్జి ఎంపీడీవో జీవీఎస్‌వి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులకు దుప్పట్ల పంపిణీ

విడవలూరు, జనవరి 7: మండల పరిధిలోని పార్లపల్లి గిరిజన కాలనీలో ఆదివారం గ్రామసర్పంచు రామిశెట్టి స్వాతి గిరిజనులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అమె మాట్లాడుతూ చలికాలంలో గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారని సొంత నిధులతో దుప్పట్లు కొనుగోలు చేసి అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు రామిశెట్టి వెంకటేశ్వర్లు, తాతా బాలకృష్ణ, పూండ్ల ఏసోబు, తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

పొదలకూరు, జనవరి 7 : పొదలకూరు మేజర్ పంచాయతీలోని లింగంపల్లి హరిజనవాడలో ఆదివారం ఎన్‌ఎస్‌ఎస్ స్పెషల్ క్యాంప్‌లో భాగంగా స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు మురుగు ప్రదేశాల్లో బ్లీచింగ్ చల్లారు. కాలనీ వాసులకు మలేరియా, డెంగ్యూ, టైఫాయిడ్, ఇతర సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ ఎస్‌డీ నహీద్, ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు పాల్గొన్నారు.

లైవ్ ఫిష్ తూకాల్లో మోసం

పొదలకూరు, జనవరి 7 : పట్టణంలోని గేట్ సెంటర్‌లో చేపల మార్కెట్ లోని లైవ్ ఫిష్ అమ్మకాల సమయంలో తూకంలో మోసం చేస్తున్నారని ఆదివారం కొనుగోలుదారులు వ్యాపారస్థులతో వాగ్వివాదానికి దిగారు. చేపల వ్యాపారస్తుల తూకానికి బయట తూకానికి అరకిలో తేడా ఉందని కొనుగోలుదారులు మండిపడుతున్నారు. చేపల వ్యాపారస్తుల తూనిక రాళ్లను తూనికల కొలతల అధికారులు తనిఖీలు చేపట్టి తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

నియోజకవర్గ క్రిస్టియన్ సెల్ టీడీపీ ప్రధాన కార్యదర్శిగా కుందుర్తి



కుందుర్తి నాగేశ్వరరావు

కొడవలూరు, జనవరి 7 : కోవూరు నియోజకవర్గ క్రిస్టియన్ సెల్ టీడీపీ ప్రధాన కార్యదర్శిగా కుందుర్తి నాగేశ్వరావును నియమించినట్లు టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పోలంరెడ్డి దినేష్‌రెడ్డి ఆదివారం ప్రకటించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ టీడీపీతోనే పేదల సంక్షేమం సాధ్యమన్నారు. తనకు ఈ అవకాశం కల్పించిన పోలంరెడ్డి దినేష్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. ఆయన వెంట టీడీపీ సినియర్ నాయకుడు నాపా వెంకటేశ్వర్లు నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

శ్మశానంలో పిచ్చి మొక్కలు తొలగించండి



పిచ్చిమొక్కలతో నిండిన ప్రధాన శ్మశానం

పొదలకూరు, జనవరి 7 : పట్టణంలోని శివాలయం సమీపంలోని హిందూ శ్మశానం పిచ్చి మొక్కలతో, చెత్తాచెదారాలతో అధ్వాన్నంగా ఉంది. కనీసం మృతదేహాలను పూడ్చేందుకు శ్మశానం లోకి తీసుకెళ్లేందుకు ముళ్లచెట్లు అడ్డుగా ఉన్నాయి. పంచాయతీ అధికారులు స్పందించి శ్మశానంలోని పిచ్చిమొక్కలను, ముళ్లకంపలను, చెత్తాచెదారాలను తొలగించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

గాంధీ ఆశ్రమంలో సర్వమత ప్రార్థనలు

ఇందుకూరుపేట, జనవరి 7 : మండలంలోని పల్లిపాడు పినాకినీ సత్యాగ్రహ గాంధీ ఆశ్రమంలో ఆదివారం సర్వమత ప్రార్థనలు జరిగాయి. ముందుగా కమిటీ సభ్యులు గణేశం దయాకర్‌రెడ్డి, షేక్.అల్లాబక్షు మహాత్మాగాంధీ విగ్రహానికి ఖాదీ వస్త్రాలు, నూలుమాలలు, ఆశ్రమ స్థల దాత పొనక కనకమ్మ విగ్రహానికి పట్టు వస్త్రాలు, నూలుమాలలు సమర్పించారు. అనంతరం కమిటీ సభ్యులు జీవీ రామిరెడ్డి విద్యార్థులకు గాంధీ సిద్ధాంతాలను, ఆశయాలను వివరించారు. కమిటీ సభ్యులు గణేశం సుమంత్‌రెడ్డి స్కూల్ తినుబండారాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గంపల మంజుల, వేణు, విద్యార్థులు, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గంధ మహోత్సవం



దర్గాలో గంధానికి పూజలు నిర్వహిస్తున్న దర్గా ముజావర్లు

వెంకటాచలం, జనవరి 7 : వెంకటాచలం గ్రామంలో ఉన్న నాగూర్ మీరయ్య నిషాన్ దర్గా 54వ గంధమహోత్సవం సందర్భంగా శనివారం అర్ధరాత్రి ట్రాక్టర్‌పై గంధాన్ని ఉంచి మేళతాళాల మధ్య గ్రామంలో స్వామివారి ఊరేగింపు జరిగింది. ఊరేగింపు అనంతరం ఆదివారం వేకువజామున దర్గా వద్దకు చేరిన గంధానికి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులు, గ్రామస్థులకు పంచిపెట్టారు. గంధం ఊరేగింపును దర్గా ముజావర్లు షేక్ ఇంతియాజ్, షేక్ బాబు, నస్రుద్దీన్, నిజాముద్దీన్, షేక్ జిలాని, సిరాజుద్దీన్, ఫక్రుద్దీన్, పఠాన్ ఫిరోజ్ ఖాన్, జాకిర్, సలావుద్దీన్, మున్వర్, నయూమ్, అక్మల్, వసీమ్, షాలు, ఇలియాస్ తదితరులు పర్యవేక్షించారు.

జనసేన పాదయాత్ర ప్రారంభం



పాదయాత్ర ప్రారంభిస్తున్న జనసేన నాయకులు

తోటపల్లిగూడూరు, జనవరి 7: జనసేన, టీడీపీలు కలిసి ప్రజా ప్రభుత్వం స్థాపించాలని కోరుతూ కాటేపల్లి సముద్ర తీరాన వెలసిన చంద్రశేఖరస్వామికి 108 కొబ్బరికాయలు కొట్టి సర్వేపల్లి నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జ్ బొబ్బేపల్లి సురేష్‌నాయుడు ఆధ్వర్యంలో పాదయాత్ర ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మండలంలోని వేళాంగిని మాత చర్చి, వరిగొండ జ్వాలాముఖి అమ్మవారిని ముందుగా దర్శనం చేసుకుని అనంతరం పాదయాత్ర ప్రారంభించారు. సురేష్‌నాయుడు మాట్లాడుతూ రాష్ట్రంలో జనసేన, టీడీపీల ప్రజా ప్రభుత్వం ఏర్పాటుతోపాటు సర్వేపల్లి నియోజకవర్గంలో జనసేన, టీడీపీ ఉమ్మడి అభ్యర్థిని అత్యధిక మెజారిటీతో గెలిపించే విధంగా జనసేన పార్టీ పోరాటం చేస్తుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో తోటపల్లి గూడూరు మండల అధ్యక్షుడు సందీప్, శ్రీనివాసులు, రవి, వీరా మహిళా శ్రీదేవి, ఐటీ విభాగం ప్రసాద్, పొదలకూరు మండలాధ్యక్షుడు అనీల్, వెంకటాచలం మండలం నాయకులు పినిశెట్టి మల్లికార్జున్, రహీం, అశోక్, హరి, మస్తాన్, చిన్న, మురళి, తదితరులు పాల్గొన్నారు.

గండికోటకు 'సాంస్కృతిక బంధు' పురస్కారం

బుచ్చిరెడ్డిపాళెం, జనవరి 7: తెలుగుభాష ఔన్నత్యాన్ని, సాంస్కృతిక వారసత్వాన్ని భవిష్యత్తరాలకు అందదిస్తున్న సేవలకు బుచ్చిరెడ్డిపాళెం రామచంద్రాపురం ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు గండికోట సుధీర్‌కుమార్‌కు 'సాంస్కృతిక బంధు' పురస్కారం దక్కింది. రాజమహేంద్రవరంలో 3రోజులుగా ఆంధ్ర సారస్వత పరిషత్ ఆధ్వర్యంలో జరుగుతున్న అంతర్జాతీయ తెలుగు మహాసభల ముగింపు ఉత్సవాల సందర్భంగా గుజరాత్ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సీహెచ్ మానవేంద్రనాథ్ చేతులమీదుగా గండికోటకు పురస్కారం అందజేసి అభినందించారు. గండికోట పురస్కారం అందుకోవడంపై ఎంఈఓలు దిలీప్‌కుమార్, పీవీ.రత్నం పలువురు ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

చేనేత భేరి సభను జయప్రదం చేయండి

బుచ్చిరెడ్డిపాళెం, జనవరి7: ఫిబ్రవరి 4న జరగబోయే చేనేత భేరి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని చేనేత కుటుంబాల నాయకులు కోరారు. ఈమేరకు ఆదివారం బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీలో చేనేత, కార్మిక కుటుంబాలు, స్థానిక నాయకులతో జిల్లా, నాయకులు నందం అశ్వద్ధామ, ఆశా సురేష్, సోమా గోపాల్ సమావేశం ఏర్పాటు చేసి చేనేత భేరి సభకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పోలిశెట్టి నరసయ్య, తాళ్ల నరసింహస్వామి, కాసా శ్రీనివాసులు సమన్వయకర్తలుగా వ్యవహరించారు.

నేడు ముగ్గుల పోటీలు

పొదలకూరు, జనవరి 7 : సంక్రాంతి పండుగను పురస్కరించుకుని స్థానిక విజేత ఇంగ్లీషు మీడియం స్కూల్‌లో విప్రో డిస్ట్రిబ్యూటర్ కీర్తి ఎంటర్‌ప్రైజెస్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నట్లు కరస్పాండెంట్ జి కామాక్షి తెలిపారు. సోమవారం మధ్యాహ్నం ఒంటిగంట నుంచి 3గంటల లోపు పోటీలు నిర్వహిస్తామన్నారు. పోటీల్లో ప్రతిఒక్కరూ పాల్గొనవచ్చన్నారు. గెలుపొందిన వారికి బహుమతులు అందజేస్తామన్నారు. పూర్తి వివరాలకు 94401 94998, 99486 94826 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

రాముడి అక్షితల పంపిణీ

బుచ్చిరెడ్డిపాళె, జనవరి 7: బుచ్చిరెడ్డిపాళెంలోని కామాక్షికాలనీలో ఆదివారం బీజేపీ నాయకులు అయోధ్య రామచంద్రుడి అక్షితలు పంపిణీ చేశారు. ఈనెల 22న అయోధ్యలో శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ ఆధ్వర్యంలో బాలరాముని విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమం జరగనుంది. ఈ సందర్భంగా బుచ్చిలో మైనారిటీ మోర్చా జిల్లా అధ్యక్షుడు షేక్ ఖాదర్‌బాషా స్థానికులతో కలిసి ముందుగా కామాక్షికాలనీలో వెలసివున్న చెంగాళమ్మ పరమేశ్వరి దేవి ఆలయం వద్ద పూజలు నిర్వహించి అనంతరం ఇంటింటికి అక్షితలు పంపిణీ చేశారు. బీజేపీ నాయకులు రఘురామయ్య, ప్రసాద్, శ్రీధర్, కాలనీ వాసులు పాల్గొన్నారు.

డిమాండ్లు నెరవేర్చే వరకు ఆందోళన కొనసాగిస్తాం

బుచ్చిరెడ్డిపాళెం: అంగన్‌వాడీ వర్కర్ల న్యాయపరమైన డిమాండ్లు నెరవేరే వరకు ఆందోళన విరమించే ప్రసక్తే లేదని సీఐటీయూ మండల కార్యదర్శి చల్లకొలుసు మల్లికార్జున అన్నారు. అంగన్‌వాడీలపై ప్రభుత్వం ఎస్మా చట్టాన్ని ప్రయోగించడాన్ని నిరసిస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో బుచ్చిలోని బెజవాడ గోపాల్‌రెడ్డి పార్కు వద్ద ఆది వారం అంగన్‌వాడీ కార్యకర్తలు జీఓ నెంబరు2 ప్రతులను తగులబెట్టి నిరసన తెలిపారు. అంగన్‌వాడీ కార్యకర్తలు కవిత, సుమ, కార్యకర్తలు, సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

రజక కుటుంబాలతో టీడీపీ నేతల సమీక్ష

బుచ్చిరెడ్డిపాళెం: కామాక్షినగర్‌లోని రజక కుటుంబాలతో స్థానిక టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి గంజం రాఘవేంద్ర ఆధ్వ ర్యంలో నాయకులు ఆదివారం సమావేశమయ్యారు. రజక కుటుంబాల సమస్యలను అడి గి తెలుసుకున్నారు. నెల్లూరు పార్లమెంట్ బీసీ సెల్ కార్యదర్శి గంధం అంకయ్య, నెల్లూరు పార్లమెంట్ సాధికార రజక సభ్యులు వల్లూరు శ్రీనివాసులు, ఏపీ బీసీ ఫెడరేషన్ బుచ్చి మండల అధ్యక్షుడు తుమ్మల ప్రసాద్, మహేష్, చెన్నయ్య, సురేష్, రజక నాయకులు పాల్గొన్నారు.

శాంతిభద్రతలు కాపాడే ప్రభుత్వాన్ని ఎన్నుకోవాలి

● మాజీ మంత్రి పొంగూరు నారాయణ

● ఆర్యవైశ్య మహాసభ కార్యవర్గాలకు అభినందన



ఆర్యవైశ్య నాయకులతో సంఘీభావం తెలుపుతున్న పొంగూరు నారాయణ

నెల్లూరు (సాంస్కృతికం), జనవరి 7 : వ్యాపారులు పన్నులు చెల్లిస్తే ప్రభుత్వం నడుస్తుంది, వ్యాపారం బాగా జరగాలంటే శాంతిభద్రతలు పటిష్ఠంగా ఉండాలి... ఈ నేపథ్యంలో శాంతిభద్రతలు పటిష్ఠంగా అమలు చేసే ప్రభుత్వాన్ని ఎన్నుకోవాలని మాజీ మంత్రి, టీడీపీ నెల్లూరు సిటీ ఇన్‌చార్జి పొంగూరు నారాయణ వ్యాపారాలు, పారిశ్రామిక వేత్తలకు పిలుపు నిచ్చారు. ఆదివారం నెల్లూరులోని మైపాడుగేట్ ప్రాంతంలోగల కేపీఆర్ కల్యాణ మండపంలో నెల్లూరు జిల్లా అర్బన్ ఆర్యవైశ్య మహాసభ నూతన కార్యవర్గ అభినందన సభ జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న నారాయణ మాట్లాడుతూ చంద్రబాబు హయాంలో వ్యాపార, వర్తక, వాణిజ్య, పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించారని గుర్తు చేశారు. ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు చిన్ని రామ సత్యనారాయణ, మాజీ అధ్యక్షుడు జయంతి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ తమకు ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేసి నిధులు, విధులు అప్పగించే పార్టీలకి మద్దతు ఇస్తామన్నారు. నెల్లూరులోని ఆర్యవైశ్య సత్రాలను మహాసభకు అప్పగిస్తే వాటిని అభివృద్ధి చేసి ప్రజలకు ఉపయోగపడేలా తీర్చిదిద్దుతామని కోరారు. మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పేగు షణ్ముఖరావు, చీఫ్ ఆర్గనైజర్ కోట గురుబ్రహ్మం, జిల్లా అర్బన్ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కొండా ప్రవీణ్‌శంకర్ మాట్లాడుతూ నెల్లూరుకు చెందిన ముక్కాల ద్వారకానాథ్ రాష్ట్ర అధ్యక్షుడిగా మహాసభను నాలుగేళ్లు ఒక పార్టీకి తాకట్టు పెట్టారని విమర్శించారు. అనంతరం 330 మంది ఆర్యవైశ్య పేదలకు సంక్రాంతి కానుకగా నిత్యావసర సరుకులను పంపిణీ జరిగింది. అర్బన్ ఆర్యవైశ్య సంఘం కార్యవర్గం, అనుబంధ సంఘాల కార్యవర్గాలకు అందరూ అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నెల్లూరు పార్లమెంటు నియోజకవర్గం అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు చేవూరు దేవకుమార్‌రెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి పీ సురేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నగర రూపురేఖలు మారుస్తా..

నెల్లూరు(వ్యవసాయం): టీడీపీ అధికారంలోకి రాగానే నగర రూపురేఖలు మారుస్తానని మాజీ మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. 13వ డివిజన్ యలమవారిదిన్నె ప్రాంతంలో ఆదివారం ఆయన బాబు ష్యూరిటీ - భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. 13వ డివిజన్‌లో చిన్నారులు చదువుకునే పాఠశాలను మూసి వేయడం దారుణమని ఆగ్రహం వ్యక్తం చేశారు. 13, 51, 53, 54 డివిజన్లు ఆర్థికంగా వెనుకబడిన ప్రాంతాలని చెప్పారు. అధికారంలోకి రాగానే పెండింగ్ పనులన్నింటిని పూర్తి చేసి నగరాభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు తానే మస్తాన్, ఇన్‌చార్జి కాయల తిరుపతి, ఉపాధ్యక్షులు ప్రశాంత్, శరత్, నాయకులు మరిదాసు, మధు, మహేష్, ఓబులేసు, జనసేన నాయకులు శ్రీకాంత్ పాల్గొన్నారు.

జనసేన వెంటే చిరంజీవి యువత

● అభిమానుల ర్యాలీ

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), జనవరి 7: చిరంజీవి కుటుంబానికి చెందిన అందరు సినీ హీరోల అభిమానులు జనసేన పార్టీ వెనుకే అడుగులు వేస్తున్నారని తెలియజేస్తూ ది పవర్ ఆఫ్ జనసేన లోడెడ్ విత్ చిరంజీవి యువత పేరుతో ఆదివారం నగరంలో భారీ ర్యాలీ చేపట్టారు. వీఆర్‌సీ సెంటర్ నుంచి గాంధీబొమ్మ సెంటర్ వరకు వందలాది మంది ర్యాలీలో పాల్గొన్నారు. చిరంజీవి యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు వై రవికుమార్ మాట్లాడుతూ మిత్రపక్షాలైన రెండు పార్టీల అభ్యర్థుల మధ్య తగువు పెట్టి వైసీపీ నాయకులు లాభపడాలని అనుకోవడం పొరపాటన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో జనసేన, తెలుగుదేశం పార్టీలు అధికారం సాధించబోతున్నాయని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్, జిల్లా అధికార ప్రతినిధి కారంపూడి కృష్ణారెడ్డి, అఖిల భారత చిరంజీవి యువత ఉపాధ్యక్షుడు పావుజెన్ని చంద్రశేఖర్‌రెడ్డి, నాయకులు ప్రసాద్, గుర్రం కిషోర్, ఈగి సురేష్, చదలవాడ రాజేష్ పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న చిరంజీవి యువత, జనసేన నాయకులు

గొప్ప సాహితీవేత్త మోపూరు వేణుగోపాలయ్య



మోపూరు వేణుగోపాలయ్య చిత్రపటానికి నివాళి

నెల్లూరు (సాంస్కృతికం), జనవరి 7 : దివంగత మోపూరు వేణుగోపాలయ్య గొప్ప సాహి తీవేత్త అని, ఈ తరంలో ఆయనలా పామరులకు సైతం అర్థం అయ్యేలా ప్రవచనం చేప్పేవారు లేరని పద్య కళాపరిషత్ అధ్యక్షుడు మెట్టు రామచంద్రప్రసాద్ తెలిపారు. ఆదివారం మూలాపేట అన్నదేవుల గోవిందరెడ్డి సరస్వతీ సమాజంలో మోపూరు చిత్రపటాన్ని ఆవిష్కరించి నివాళులర్పించారు. డాక్టర్ కాళిదాసు పురుషోత్తం అభిజ్ఞాన శాకుంతలంపై ప్రవచనం చేసి అందరినీ ఆకట్టుకున్నారు. 10 పాఠశాలలకు చెందిన 100 మంది విద్యార్థులకు పద్య కంఠస్థ పోటీలు నిర్వ హించి 12 మంది విజేతలకు నగదు, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ గిరిజాలక్ష్మి, సూరం శ్రీనివాసులు, సరస్వతీ సమాజం అధ్యక్షుడు మోపూరు పెంచలయ్య, సీ పద్మనాభం, కొండా వెంకటస్వామిరెడ్డి పాల్గొన్నారు.

కోటంరెడ్డి ఆత్మీయ సమావేశం




టీడీపీలో చేరిన వారితో ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పే ట), జనవరి 7: నెల్లూరు రూరల్ నియోజకవర్గంలోని 41వ డివిజన్లో ఆదివారం ఎ మ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఆత్మీయ సమావేశం నిర్వ హించారు. వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీని ఆదరిం చాలని కోరారు. సీఎంగా చం ద్రబాబు నాయుడు, ఎమ్మెల్యే గా తనను ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జి అల్లాబక్షు, డివిజన్ అధ్యక్షుడు పాలూరు నాగేశ్వ రరావు, టీడీపీ రాష్ట్ర ముస్లిం మైనారిటీ విభాగం ప్రతినిధి హయత్‌బాబా, నాయకుడు కేసీ కృష్ణ తదితరులు పాల్గొన్నారు. కాగా, 32వ డివిజన్‌లో రూరల్ ఎమ్మెల్యే సమక్షంలో ఆదివారం సా యంత్రం పలువురు టీడీపీలో చేరారు. క్లస్టర్ ఇన్‌చార్జి మన్నేపల్లి రఘు, డివిజన్ ఇన్‌చార్జి శైలేం ద్రబాబు, డివిజన్ అధ్యక్షుడు తోట సునీల్, నాయకులు ఖాదర్ బాషా, అరుణమ్మ పాల్గొన్నారు.

30వ డివిజన్‌లో ముఖాముఖి

నెల్లూరు రూరల్: నగరంలోని 30వ డివిజన్ పోలీసు కాలనీలో ఆదివారం కార్యకర్తలతో ముఖాముఖి కార్యక్రమాన్ని ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జగన్ పాలన నచ్చక, ఇబ్బందులు పెడతారని తెలిసి కూడా 15 నెలలు ముందే అధికారాన్ని వదులుకున్నానని చెప్పారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేన కూటమి అఖండ విజయం సాధించి ప్రజా ప్రభుత్వం ఏర్పడుతుందని తెలిపారు. అనంతరం నూతనంగా ఏర్పాటు చేసిన టీడీపీ కార్యాలయాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. పలువురిని పార్టీలోకి ఆహ్వానించారు. కాగా, రూరల్ మండలంలోని గొల్లకందుకూరులో సిద్దారెడ్డి శ్రీనివాసులురెడ్డి, గుడి మధు, వేమయ్యల మిత్ర బృందాన్ని టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి ఆ గ్రామంలో కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి కుటుంబీకులు చింతారెడ్డిపాళెం, సౌత్‌రాజుపాళెం ప్రాంతాల్లో బాబు ష్యూరిటీ - భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా ఇంటింటా ప్రచారం నిర్వహించారు.

ఎస్మా చట్టాన్ని రద్దుచేయాలి : ఎస్‌ఎఫ్ఐ



రాపూరులో అంగన్‌వాడీల నిరసన

రాపూరు(డక్కిలి), జనవరి 7 : అంగన్‌వాడీలపై ప్రభుత్వం తీసుకువచ్చిన ఎస్మా చట్టాన్ని వెంటనే రద్దుచేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా మాజీ కార్యదర్శి పి శ్రీనివాసులు అన్నారు. ఆదివారం రాపూరులో అంగన్‌వాడీలు చేపట్టిన నిరసన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్మా చట్టాన్ని ప్రయోగించి ఉద్యమాలను అణచివేయాలని ప్రభుత్వం కుట్రపన్నుతోందని ఆరోపించారు. అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం అంగన్‌వాడీలు ర్యాలీగా వెళ్లి ప్రభుత్వం తీసుకువచ్చిన జీవో కాపీలను బస్టాండు సెంటరులో దహనం చేశారు. ఈ కార్యక్రమంలో కే ప్రమీల, సుభాషిణి, లత, హరిత, సుజాత, రమ్య తదితరులు పాల్గొన్నారు.

పవర్ యూత్ రక్తదాన శిబిరం

నెల్లూరు(హరనాథపురం), జనవరి 7 : తలసేమియా వ్యాధితో బాధపడే పిల్లల కోసం నగరంలోని ప్రగతి నగర్‌లో ఆదివారం పవర్ యూత్ స్వచ్ఛంద సేవా సొసైటీ మెగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేసింది. పలువురు రక్తదానం చేశారు. సొసైటీ వ్యవస్థాపకుడు రమేష్‌రాజు మాట్లాడుతూ తమ సొసైటీ 4వ వార్షికోత్సవం సందర్భంగా రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశామని చెప్పారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు ముని వెంకట సూర్య, ఉపాధ్యక్షుడు సుదాకర్, సభ్యులు శ్రీకాంత్, బాలాజీ, రమేష్, సాయి , అభిషేక్, తేజ, రెడ్‌క్రాస్ కన్వీనర్ అజయ్ బాబు తదితరులు పాల్గొన్నారు.

నేడు చంద్రశేఖరేంద్ర సరస్వతి ఆరాధన

నెల్లూరు (సాంస్కృతికం), జనవరి 6 : నగరంలోని పొగతోట ఆదిశంకర ధ్యాన మందిరంలో సోమవారం సాయంత్రం 6గంటలకు పరమాచార్య చంద్రశేఖరేంద్ర సరస్వతి ఆరాధనోత్సవం జరుగుతుందని చక్రాలవారి ట్రస్ట్, ఆదిశంకర ధ్యాన మందిరం మేనేజర్ చక్రాల వెంకటలక్ష్మీ నరసింహం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమాన్ని జంగా శివకుమార్ ప్రారంభిస్తారని, చంద్రశేఖరేంద్ర సరస్వతి స్వామి జీవన వైవిష్యంపై వేలమూరు సోమశేఖరశర్మ ప్రవచిస్తారని, భక్తులందరూ తరలిరావాలని కోరారు.

నేడు గంధమహోత్సవం

నెల్లూరు(సాంస్కృతికం), జనవరి 7 : చిన్నబజారులోని ఖ్వాజాపీర్ సాహెబ్ నెల్లూరు పెద్ద దర్గా గంధ మహోత్సవం సోమవారం రాత్రి 10గంటల నుంచి ప్రారంభమవుతుందని కేఎస్ఎస్ బాబాసాహెబ్ బంధన్వాజీ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గంధం ఖ్వాజాపీర్ మఖన్ అస్సార్ ఘర్ నుంచి బయలుదేరి దర్గాకు చేరుకుంటుందని తెలిపారు. పీఠాధిపతులు గంధం లేపనం చేసి, కరోనా తొలగిపోవాలని మతసామరస్యం కోసం ప్రార్థనలు చేస్తారని తెలిపారు.

సౌత్‌మోపూరులో ఆటల పోటీలు

నెల్లూరు రూరల్, జనవరి 7 : మండలంలోని సౌత్ మోపూరు గ్రామంలో ఆదివారం సంక్రాంతి ఆటల పోటీలను జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ ప్రారంభించారు. క్రీడల్లో పాల్గొనే వారంతా స్నేహపూర్వక వాతావరణంలో నడుచుకోవాలని పిలుపునిచ్చారు. సంక్రాంతి ఆటలకు పల్లెల్లో ప్రత్యేక గుర్తింపు ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పోలయ్య, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విశ్వసాయి డాక్టర్ ఎస్ఆర్‌కేలో వార్షికోత్సవం

నెల్లూరు (విద్య), జనవరి 7 : నగరంలోని మాగుంటలేఅవుట్ విశ్వసాయి డాక్టర్ ఎస్ఆర్‌కే పాఠశాల వార్షికోత్సవ వేడుకలు కస్తూర్బా కళాక్షేత్రంలో ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ పీఎస్ చక్రవర్తి విద్యార్థుల్లో మానసిక సమస్యలు ఎలా అధిగమించా లన్న అంశంపై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు, సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. ఈ కార్యక్రమంలో విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ సత్యనారాయణ, డైరెక్టర్ కృష్ణమోహన్, ప్రిన్సిపాల్ రఘురామ్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, సిబ్బంది పాల్గొన్నారు.

వృద్ధురాలి కడుపులో గడ్డ తొలగింపు

నెల్లూరు రూరల్, జనవరి 7 : కడుపులో గడ్డతో బాధపడుతున్న 60 ఏళ్ల వృద్ధురాలికి ఆపరేషన్ ద్వారా గడ్డను తొలగించినట్లు నగరంలోని దీప్తి నర్సింగ్ హోం వైద్యులు ఆదివారం తెలిపారు. సైదాపురం మండలానికి చెందిన సీతారావమ్మ కొన్ని రోజులుగా అజీర్ణం, వాంతులు, పొట్టపెద్దదిగా పెరగడం వంటి సమస్యలతో బాధపడుతోందన్నారు. తమ వద్దకు వచ్చిన ఆమె పరీక్షలు జరిపి కడుపులో గడ్డ ఉన్నట్లు తేల్చినట్లు వైద్యులు లోకనాథం, సుమతి తెలిపారు. వయసుతో సంబంధం లేకుండా అత్యంత సున్నితంగా ఆపరేషన్ చేసి గడ్డను తొలగించామని చెప్పారు. 40-50 ఏళ్ల పైబడిన మహిళలు ఇలాంటి ఇబ్బందులుంటే వెంటనే వైద్యులను సంప్రదించాలని కోరారు.

కరపత్రాలు, అక్షితల పంపిణీ

నెల్లూరు (సాంస్కృతికం), జనవరి 7 : అయోధ్యలో బాల రాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ నేపథ్యంలో అక్కడి నుంచి వచ్చిన అక్షితలు, కరపత్రాలను ఆదివారం నగరంలోని 36, 37 డివిజన్లలో పంపిణీ చేశారు. శబరి శ్రీరామ క్షేత్రం ఆధ్వర్యంలో ఆర్ఎస్ఎస్, వీహెచ్‌పీ, వాటి అనుబంధ సంఘాల కర సేవకులు వీటిని అందచేస్తున్నారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ కార్యదర్శులు నాగిరెడ్డి ప్రదీప్ కుమార్, మాల్యాద్రి, శబరి శ్రీరామక్షేత్రం భక్త బృందం రఘురామ కృష్ణంరాజు, జయశంకర్, కట్టా చంద్రశేఖర్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, శివరాజు, శ్రీనాథ్, తొండా రవిశంకర్, తదితరులు పాల్గొన్నారు.

పక్షులకన్నా హీనంగా చూస్తారా?

- కొరిడి-పేర్నాడు దారిలో తారు రోడ్డు నిర్మించండి
- లేదంటే ఎన్నికలు బహిష్కరిస్తాం
- మరమ్మతులను అడ్డుకున్న పులికాట్ తీరంలోని గ్రామస్తులు


రోడ్డు మరమ్మతులను అడ్డుకుంటున్న జనం


కొరిడి-పేర్నాడు రోడ్డులో ధర్నా చేస్తున్న పులికాట్ తీర ప్రాంతంలోని గ్రామస్తులు

సూళ్లూరుపేట, జనవరి 7: పక్షులకన్నా తమను హీనంగా చూస్తున్నారంటూ పులికాట్ తీర ప్రాంతంలోని గ్రామాల వాసులు ఆవేదన వ్యక్తం చేశారు. కొరిడి-పేర్నాడు రోడ్డుకు చేస్తున్న మరమ్మతులను ఆదివారం వారు అడ్డుకుని, ధర్నా చేశారు. వారి మాటల్లోనే.. 'మిచౌంగ్ తుఫాన్ ప్రభావంతో వచ్చిన వరద నీటి ప్రవాహానికి పులికాట్ తీర ప్రాంత గ్రామాలకు వెళ్లే కొరిడి-పేర్నాడు రోడ్డు దాదాపు రెండు కిలోమీటర్ల మేర కోతకు గురైంది. దాంతో ఆర్టీసీ అధికారులు మా గ్రామాలకు బస్సును రద్దు చేశారు. దాదాపు నెల రోజులుగా బస్సు సౌకర్యం లేక తీవ్ర ఇబ్బంది పడుతున్నాం. పిల్లలైతే బడులకు ఏడు కిలోమీటర్ల మేర నడిచి వెళుతున్నారు. ఇన్ని రోజులుగా మా సమస్యను పరిష్కరించాలని మొర పెట్టుకుంటూనే ఉన్నాం. ఎవరూ పట్టించుకోలేదు. ఇపుడు అధికార పార్టీ నాయకులు కొందరు ఎక్స్‌కవేటర్లు తీసుకొచ్చి రోడ్డు పక్కనే ఉన్న మట్టిని తవ్వి గుంతలు పూడ్చే పనులు ప్రారంభించారు. వేస్తే తారు రోడ్డు వేయండి.. లేదంటే వెళ్లిపోండి. మా బాధలు మేము పడతాం. కూతవేటు దూరంలో ఉన్న షార్ కేంద్రానికి తారు రోడ్డుకు అభ్యంతరం లేనప్పుడు మా గ్రామాలకు ఎందుకు ఉంది. పైగా పక్షుల పండగకు కోట్లాది రూపాయల నిధులు మంజూరు చేస్తారు. తీర ప్రాంత గ్రామాలకు కనీసం రోడ్డు సౌకర్యం కల్పించేందుకు నిధులు లేవా? మమ్మల్ని అంత హీనంగా చూస్తారా..? తారు రోడ్డు నిర్మాణం జరగకుంటే ఎన్నికలను సైతం బహిష్కరిస్తాం. ఓటు వద్దు.. తారురోడ్డే ముద్దు' అంటూ నినాదాలు చేశారు. అక్కడున్న అధికార పార్టీ నాయకులు వెంటనే ఆర్టీసీ అధికారులకు చెప్పడంతో వారు బస్సును పంపించారు. దీనిపై గ్రామస్తులు మరింత ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇన్ని రోజులుగా తాము చెబితే పట్టించుకోకుండా, అధికార పార్టీ నేతలు చెప్పిన వెంటనే పంపిస్తారా.. అంటూ ఆ బస్సును అడ్డుకుని వెనక్కి పంపించారు. దాదాపు గంటకుపైగా ఈ మార్గంలో వాహనాలు నిలిచిపోయాయి. చివరకు పోలీసులు వచ్చి గ్రామస్తులకు సర్దిచెప్పి, రాకపోకలు పునరుద్ధరించారు.


కప్పగుంటకండ్రిగ గ్రామ సమీపంలో పిచ్చిమొక్కలతో నిండిన కాలువ

పాలచ్చూరు కాలువ పూర్తయ్యేదెన్నడు?

- బిల్లులు రాక సిమెంటు లైనింగ్ పనులను ఆపేసిన కాంట్రాక్టర్
- పిచ్చిమొక్కలతో నిండిపోతోందని రైతుల ఆవేదన

పెళ్లకూరు, జనవరి 7: పాలచ్చూరు కాలువ ఇప్పట్లో పూర్తయ్యేలా కనిపించడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్వర్ణముఖినదిపై పెళ్లకూరు మండలంలోని కలవకూరు వద్ద ఏర్పాటు చేసిన ఈ కాలువ.. చెక్ డ్యామ్ నుంచి నాయుడుపేట, పెళ్లకూరు, ఓజిలి మండలాల్లో 13 చెరువులకు సాగునీటిని అందిస్తుంది. సుమారు 10 కిలోమీటర్ల మేర ప్రవహించే అవకాశం ఉండటంతో అధికారికంగా 10వేలకుపైగా ఎకరాలకు, అనధికారికంగా మరో ఐదు వేల ఎకరాలకు సాగునీరు అందుతుంది. పైగా కాలువ సాగే ప్రాంతమంతా భూగర్భ జలాలు వృద్ధి చెందుతాయి. తాగునీటికి కూడా సమీప ప్రాంతాలకు ఆధారంగా ఉంటుంది.

త్వరలోనే పనులు ప్రారంభిస్తాం

చేసిన పనులకు సంబంధించిన బిల్లులను ప్రభుత్వానికి అందజేశాం. నిధులు మంజూరైన వెంటనే పనులను ప్రారంభిస్తాం.

\- మహేష్, ఏఈ మహేష్

అంతంత మాత్రంగా లైనింగ్‌పనులు

ఈ కాలువలో సిమెంట్ లైనింగ్ ఆధునికీకరణ పనులకు 2020లో రాష్ట్ర ప్రభుత్వం రూ.31.65 కోట్లు కేటాయించింది. కాంట్రాక్టర్ పనులు చేపట్టి.. దాదాపు 48 శాతానికిపైగా పూర్తి చేశాడు. చేసిన పనులకు బిల్లులు ఇవ్వకపోవడంతో మిగిలిన పనులను ఆపేశాడు. మూడు, ఐదు, ఆరో కిలోమీటర్ల వద్ద అయితే కాలువలో పిచ్చి మొక్కలు పెరిగి, పూడిపోతోంది. ఇకనైనా ప్రభుత్వం, పాలకులు స్పందించి మిగిలిన పనులు పూర్తి చేయించాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.


తిరుపతిలో జీవో ప్రతుల దహనం

'ఎస్మా'ను ఉపసంహరించుకోవాలి

- జీవో ప్రతుల దహనం
- 27వ రోజుకు అంగన్వాడీల సమ్మె

తిరుపతి, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం జారీ చేసిన ఎస్మా జీవో ప్రతులు తగులబెట్టారు.. నల్ల బెలూన్లు, రిబ్బన్లు ధరించి.. రిలే నిరాహార దీక్షలను 27వ రోజైన ఆదివారం కూడా జిల్లావ్యాప్తంగా అంగన్వాడీ కార్యకర్తలు, సహాయకులు సమ్మె కొనసాగించారు. తిరుపతి పాత మున్సిపల్ కార్యాలయం వద్ద అంగన్వాడీలు రిలే నిరాహార దీక్షలు నిర్వహించారు. శిబిరం ఎదుట ఎస్మా జీవో ప్రతులు దహనం చేయడంతోపాటు నల్ల బెలూన్లు ధరించి ప్రభుత్వానికి నిరసన తెలిపారు. గూడూరులో గ్రామసేవకుల భవనం వద్ద రిలే నిరాహార దీక్ష చేపట్టిన ఉద్యోగులు అక్కడ కూడా ఎస్మా జీవో ప్రతులు తగులబెట్టడంతోపాటు కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలిపారు. శ్రీకాళహస్తి, సత్యవేడు, పుత్తూరు పట్టణాల్లో ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయాల వద్ద కళ్లకు నల్ల రిబ్బన్లు కట్టుకుని నిరసన ప్రదర్శనలు నిర్వహించడంతోపాటు రిలే దీక్షలు కొనసాగించారు. కోటలో ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం ఎదుట రిలే నిరాహార దీక్షలు చేపట్టిన అంగన్వాడీలకు యూటీఎఫ్ నాయకులు మద్దతు ప్రకటించారు. నాయుడుపేటలో తమ డిమాండ్లు నెరవేర్చాలని పెద్ద పెట్టున నినాదాలు చేస్తూ రిలే నిరాహార దీక్షలు కొనసాగించారు. వెంకటగిరి, సూళ్లూరుపేట, చంద్రగిరి, పిచ్చాటూరు మండల కేంద్రాల్లో కూడా అంగన్వాడీలు రిలే దీక్షలు చేపట్టారు.

రెడ్లమంతా టీడీపీలోనే ఉన్నాం

తేల్చిచెప్పిన గూడూరు నియోజకవర్గంలోని నేతలు



సమావేశంలో ప్రసంగిస్తున్న పాశం సునీల్‌కుమార్

కోట, జనవరి 7: టీడీపీలోనే నాలుగు దశాబ్దాలుగా మా వర్గానికి గుర్తింపు వచ్చింది. తగిన పదవులు ఇచ్చారు. మేమెక్కడికీ వెళ్లలేదు. టీడీపీలోనే ఉన్నాం. బయట జరుగుతున్న ప్రచారం వాస్తవం కాదు' అంటూ రెడ్ల కుటుంబాల్లోని నేతలు తేల్చి చెప్పారు. కోట పట్టణంలోని రెడ్డి సంక్షేమ భవన్‌లో ఆదివారం గూడూరు నియోజకవర్గస్థాయి రెడ్డి సామాజిక వర్గం ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి నియోజకవర్గంలోని గూడూరు, కోట, చిల్లకూరు, వాకాడు, చిట్టమూరు మండలాలకు చెందిన 600పైగా రెడ్ల కుటుంబాలు హాజరయ్యాయి. ఎన్టీఆర్.. పార్టీని స్థాపించిన నాటినుంచి ఇప్పటి వరకు టీడీపీలోనే రెడ్లకు ప్రాధాన్యం ఇవ్వడం జరిగిందన్నారు. మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్‌కు గూడూరు టిక్కెట్ ఇస్తే.. అత్యధిక మెజార్టీతో గెలిపించి.. చంద్రబాబుకు కానుకగా ఇస్తామన్నారు. వైసీపీలో రెడ్లను వాడుకున్నారేతప్ప సముచిత స్థానం కల్పించలేదం లేదని చెప్పారు. అందువల్ల అక్కడున్న వారంతా కూడా టీడీపీలోకి వచ్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. ఎన్నికలు వస్తున్న నేపథ్యంలో ఇప్పటినుంచే ప్రచారంలోకి అన్ని కుటుంబాలు దిగుతాయని స్పష్టం చేశారు. అనంతరం పాశం సునీల్‌కుమార్ మాట్లాడుతూ.. తాను దశాబ్దకాలంగా నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రతి కార్యకర్త కష్టంలోనూ పాల్పంచుకుంటున్నానని చెప్పారు. తనపై ఇంతటి అభిమానం చూపించిన రెడ్ల కుటుంబాలకు జీవితాంతం రుణపడి ఉంటానని చెప్పడంతో ఒక్కసారిగా కరతాళ ధ్వనులతో భవనం మార్మోగింది. ఆయా మండలాల టీడీపీ అధ్యక్షులు సర్వోత్తమరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, వెంకటేశ్వర్లురెడ్డి, కిషోర్‌నాయుడు, వెంకటేశ్వరరాజులతోపాటు రాష్ట్ర నాయకులు ఈశ్వరవాక శివకోటారెడ్డి, శ్రావణిరెడ్డి, భారతీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


రెడ్ల కుటుంబాలతో కిక్కిరిసిన సంక్షేమ భవన్

యువతిని కత్తితో బెదిరించి దోపిడీ

- పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితులు

తిరుపతి(నేరవిభాగం), జనవరి 7: జాతీయ రహదారిలో నిర్మానుష్య ప్రాంతంలో వాష్‌రూమ్‌కు వెళ్లిన యువతిని ఇద్దరు దుండగులు కత్తితో బెదిరించి బంగారు ఉంగరాలు, సెల్‌ఫోన్లు కాజేసిన విషయంపై ఆదివారం తిరుపతి రూరల్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. చంద్రగిరి డీఎస్పీ డాక్టర్ యశ్వంత్, రూరల్ ఎస్ఐ నాగేంద్రబాబు తెలిపిన వివరాల మేరకు.. పుంగనూరుకు చెందిన మాధవి తిరుపతిలోని ఓ పీజీ హాస్టల్లో ఉంటూ సీఏ కోర్సు చదువుతోంది. పుంగనూరుకు చెందిన సిమెంట్, స్టీల్ వ్యాపారి దేవకుమార్ శనివారం తిరుపతికి వచ్చి తిరుగు ప్రయాణంలో మాధవిని తనతోపాటు ఆయన కారులో తీసుకువెళ్లాడు. పూతలపట్టు- నాయుడుపేట జాతీయ రహదారిలో వెళుతుండగా మాధవి వాష్‌రూమ్‌కి వెళ్లాలని చెప్పడంతో వకుళమాత ఆలయ సమీపంలో దేవకుమార్ కారును ఆపారు. ఆ పక్కనే ఉన్న నిర్మానుష్య ప్రాంతంలోకి మాధవి వెళ్లింది. ఇద్దరు దుండగులు మాధవి దగ్గరకు వెళ్లి కత్తితో బెదిరించి.. ఆమె వద్ద ఉన్న బంగారు ఉంగరాలు కాజేశారు. అంతటితో ఆగక ఆమెను కారు వద్దకు తీసుకొచ్చారు. అదే కారులో మాధవి, దేవకుమార్‌ను కిడ్నాప్ చేసి.. భారీ మొత్తంలో నగదు కాజేసేందుకు నేండ్రగుంటవైపు తీసుకెళ్లారు. కారు టోల్‌గేట్ వద్దకు చేరుకోగానే అందులో ఉన్న మాధవి కిందకు దూకేసి పెద్దగా కేకలు వేయడంతో ఆ ఇద్దరు దుండగులు కారి దిగి పారిపోయారు. ఈ మేరకు బాధితులు ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదుచేసిన పోలీసులు టోల్‌గేట్ వద్ద ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించగా దోపిడీకి పాల్పడినవారు 25 ఏళ్లలోపు యువకులుగా గుర్తించారు. వీరిని త్వరలోనే పట్టుకుంటామని పోలీసులు తెలిపారు.

23 మంది సీఐల బదిలీ

తిరుపతి(నేరవిభాగం), జనవరి 7: జిల్లాలో 23 మంది సీఐలు బదిలీ అయ్యారు. అనంతపురం రేంజ్ డీఐజీ అమ్మిరెడ్డి ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు.

వివరాలిలా..

వి.సుబ్రహ్మణ్యంరెడ్డి.. తిరుపతి రూరల్(ఎం.ఆర్‌పల్లె) నుంచి వీఆర్ ఎస్పీ, సత్యసాయి జిల్లాకు, ఎన్.విక్రమ్.. బీఎన్ కండ్రిగ నుంచి వీఆర్ ఎస్పీ, అనంతపురానికి, వై.బాలకృష్ణ.. ఆర్ఎస్‌టీఎఫ్, తిరుపతి నుంచి ఆర్ఎస్‌టీఎఫ్, తిరుపతి ఐఈ, కె.రాజశేఖర్.. చంద్రగిరి నుంచి ఎస్‌బీ తిరుమలకు, పి.రామకృష్ణాచ్చారి.. ఎస్పీ, తిరుమల నుంచి వీఆర్ ఎస్పీ, తిరుపతికి, కె.లక్ష్మీనారాయణ.. పుత్తూరు నుంచి వీఆర్ ఎస్పీ, అనంతపురానికి, బి.ప్రవీణ్ కుమార్.. సీసీఎస్, తిరుపతి నుంచి వీఆర్ ఎస్పీ, సత్యసాయి జిల్లాకు, బీవీ శివప్రసాద్ రెడ్డి.. తిరుచానూరు నుంచి ఎబీ్, తిరుపతికి, పి.సురేంద్రనాథ్ రెడ్డి.. భాకరాపేట నుంచి పీసీఆర్, తిరుపతికి, పి.జగన్మోహన్ రెడ్డి.. తిరుమల 1టౌన్ నుంచి డీటీసీ, తిరుపతికి, కె.వెంకటప్ప.. డీటీసీ, తిరుపతి నుంచి సీసీఎస్, తిరుపతికి, టి.చిరంజీవి రావు.. పీసీఆర్, తిరుపతి నుంచి వీఆర్ ఎస్పీ, తిరుపతికి, జి.అమర్‌నాథ్‌రెడ్డి .. సీసీఎస్, తిరుపతి నుంచి సోషల్ మీడియా, సైబర్ క్రైమ్‌కి, ఎన్.రవీంద్రనాథ్.. సీసీఎస్, తిరుపతి నుంచి వీఆర్ ఎస్పీ, సత్యసాయి జిల్లాకు, వి.శివప్రసాద్.. ట్రాఫిక్, తిరుపతి నుంచి వీఆర్ ఎస్పీ, అనంతపురానికి, ఓ.రామచంద్రారెడ్డి.. సైబర్ క్రైమ్ నుంచి ఎస్సీ ఎస్టీ సెల్, తిరుపతికి, బి.నాగరాజు.. ఎస్సీ ఎస్టీ సెల్, తిరుపతి నుంచి వీఆర్ ఎస్పీ, తిరుపతికి, బీవీ శ్రీనివాసులు.. వీఆర్ ఎస్పీ, తిరుపతినుంచి వీఆర్ ఎస్పీ, అనంతపురానికి, ఎం.శ్రీనివాసులు.. ఎస్పీ, తిరుపతి నుంచి డీసీఆర్బీ, తిరుపతికి, ఆర్.ఎస్.మధుబాబు.. వీఆర్ ఎస్పీ, తిరుపతి నుంచి వీఆర్ ఎస్పీ, సత్యసాయి జిల్లాకు, ఆర్.వినోద్ కుమార్.. వీఆర్ ఎస్పీ, తిరుపతి నుంచి సైబర్ క్రైమ్, తిరుపతికి, ఎం.భాస్కర్ నాయక్.. పుత్తూరు రూరల్ నుంచి సీఐ, పుత్తూరు రూరల్ ఐఈ, సీహెచ్ అంజూయాదవ్.. శ్రీకాళహస్తి వన్‌టౌన్ నుంచి డీటీఆర్‌బీ, తిరుపతికి బదిలీ అయ్యారు.

ఇదేం బరితెగింపు..!

శ్రీకాళహస్తిలో కొందరు అధికార పార్టీ నేతలు అక్రమాలతో చెలరేగిపోతున్నారు. పట్టణ పరిధిలోని స్వర్ణముఖి నదిలోకి చొరబడి మట్టి, ఇసుకను కొల్లగొట్టారు. భారీ యంత్రాలు, టిప్పర్లతో బాహాటంగా తవ్వకాలు చేయడాన్ని చూసిన వారంతా ఇదేం బరితెగింపు అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.


నదిలోకి అక్రమార్కులు వేసిన రోడ్డు


ప్రైవేటు స్థలంలోకి డంపింగ్


యంత్రాలతో జోరుగా తవ్వకాలు

- నదిలోకి దర్జాగా రోడ్డు ఏర్పాటు
- భారీ యంత్రాలు పెట్టి మట్టి, ఇసుక తరలించేసిన అధికార పార్టీ నేతలు
- శ్రీకాళహస్తిలో స్వర్ణమ్మ శోకం

శ్రీకాళహస్తి జనవరి 7: ముక్కంటి భక్తులు ఎంతో పవిత్రంగా ఆరాధించే స్వర్ణముఖి నదిలో ఎన్నో ఏళ్ల క్రితమే ఇసుక తవ్వకాలను నిషేధించారు. నిబంధనలతో తమకేం పని అనుకున్నారేమో.. కొందరు అధికార పార్టీ నేతలు ఏకంగా నదిలో అనధికారిక రోడ్డును నిర్మించారు. ఆపై ప్రైవేటు వెంచర్ కోసం నదిలోని మట్టి, ఇసుకను భారీ యంత్రాలతో దర్జాగా తవ్వి తరలించారు.

అధికారం అండతోనే..

పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయం వెనుక నది ఒడ్డున ప్రైవేటు భూమి ఉంది. ఇందులో వెంచర్ వేయడానికి కొందరు అధికార పార్టీ నేతలు కసరత్తు ప్రారంభించారు. అధికారం అండగా ఉండడంతో.. ఎవరు అడ్డుకుంటారన్న ధీమాతో రెండ్రోజుల నుంచి క్రషర్ దుమ్ముతో నదిలోకి రోడ్డు వేశారు. ఆదివారం భారీ యంత్రాలతో నదిలోకి చొరబడి యథేచ్ఛగా తవ్వకాలు సాగించారు. స్థానికుల సమాచారంతో ఆంధ్రజ్యోతి అక్కడికి వెళ్లి ఫొటోలు తీసింది. నదిలో మట్టి, ఇసుక తవ్వకాలు చేస్తున్న యంత్రాల మధ్య ముక్కంటి ఆలయం రాజగోపురం కూడా స్పష్టంగా కనిపిస్తుండటం గమనార్హం. ఆంధ్రజ్యోతి వచ్చిన విషయం తెలుసుకున్న అక్రమార్కులు వెంటనే అక్కడి నుంచి ఉడాయించారు.

పేట వైసీపీలో అవే వర్గ విభేదాలు

- పింఛన్ల పంపిణీకి ఎమ్మెల్యే వస్తున్నారని మున్సిపల్ చైర్మన్ డుమ్మా

సూళ్లూరుపేట, జనవరి 7: ప్రభుత్వం పెంచిన సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమం సాక్షిగా సూళ్లూరుపేట వైసీపీలో వర్గ విభేదాలు మరోసారి బట్టబయలయ్యాయి. సూళ్లూరుపేట పట్టణంలోని ఆర్యవైశ్య కల్యాణ మండపంలో ఆదివారం పింఛన్ల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి మున్సిపాలిటీ అధికారులు చైర్మన్ దబ్బల శ్రీమంత్‌రెడ్డితోపాటు ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్యను ఆహ్వానించారు. కొంతకాలంగా అధికార పార్టీలో వర్గపోరు నడుస్తుండడంతో మున్సిపల్ చైర్మన్ ఆధ్వర్యంలో జరిగే కార్యక్రమాలకు ఎమ్మెల్యే దూరంగా ఉంటున్నారు. అయితే ఆదివారం పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి కిలివేటి హాజరవుతున్నట్లు తెలియడంతో మున్సిపల్ చైర్మన్‌తోపాటు ఆయన వర్గమంతా డుమ్మా కొట్టారు. దీంతో మున్సిపల్ అధికారులు ఎమ్మెల్యే చేతుల మీదుగా పింఛన్లను లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్మన్ దబ్బల శ్రీమంత్‌రెడ్డితోపాటు వైసీపీ పట్టణ అధ్యక్షుడు కళత్తూరు శేఖర్ రెడ్డి, దామానెల్లూరు సహకార సంఘ అధ్యక్షుడు కళత్తూరు జనార్దన్ రెడ్డి, కళత్తూరు రామ్మోహన్ రెడ్డి తదితరులు హాజరుకాలేదు.

ఏపీపీఎస్‌టీఎఫ్ జిల్లా నూతన కార్యవర్గం

తిరుపతి(విద్య),జనవరి 7 : స్థానిక టీపీపీఎం పాఠశాలలో ఏపీ ఫిజికల్‌సైన్స్ టీచర్స్ ఫోరమ్(ఏపీపీఎస్‌టీఎఫ్) ఉమ్మడి చిత్తూరు జిల్లా కార్యవర్గ సమావేశం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ టి.మోహన్‌బాబు అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఇందులో భాగంగా ఉమ్మడి జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా కేడీ సారథి, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా జి.మోహన్ నాయుడు, కె.మేఘనాథ్, ఉపాధ్యక్షులుగా పి.రవి, ఆర్థిక కార్యదర్శిగా టి.మనోహర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా ఎస్.కోదండపాణి, కె.రాజేష్‌బాబు, మహిళా కార్యదర్శులుగా ఎన్.సౌజన్య, కె.రాధారాణి, సంయుక్త కార్యదర్శులుగా డి.ధనంజయ, ఎ.మోహన్, డివిజనల్ కార్యదర్శులుగా కె.వెంకటేశ్వర, ఎస్.గజరాజన్, ఎం.సుబ్బరామయ్య, బి.రాజ్‌కుమార్, పి.కోటేశ్వరరావు, చెంగల్వరాయలను ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గానికి రాష్ట్ర అధ్యక్షుడు నియామకపత్రాన్ని అందించి అభినందించారు. చిత్తూరు, అన్నమయ్య, తిరుపతి జిల్లాలకు చెందిన టీచర్లు పాల్గొన్నారు.


కొత్త కార్యవర్గ ప్రతినిధులకు నియామకపత్రాన్ని అందిస్తున్న మోహన్‌బాబు

బీసీలపై వైసీపీది కపటప్రేమ: నెలవల



సమావేశంలో మాట్లాడుతున్న నెలవల సుబ్రహ్మణ్యం

నాయుడుపేట టౌన్, జనవరి 7: వైసీపీ బీసీలపై కపటప్రేమ చూపుతోందని సూళ్లూరుపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం అన్నారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి బీసీలు, యువతకు ప్రాధాన్యం ఇస్తోందన్నారు. సీఎం జగన్ బీసీలపై కపటప్రేమ చూపుతూ బీసీ సాధికారిత యాత్ర చేపడుతున్నారని విమర్శించారు. రాష్ట్రంలో రాక్షస పాలన, అవినీతి రాజ్యమేలుతోందన్నారు. అధికార పార్టీ నేతల దోపిడీతో సామాన్య ప్రజలకు ఇసుక అందుబాటులో లేకుండా పోయిందని ధ్వజమెత్తారు. ముఖ్యమంత్రి జగన్ కార్పొరేషన్లు ఏర్పాటు చేశారేగానీ, వాటికి నిధులు ఇవ్వకుండా నిర్వీర్యం చేశారని పేర్కొన్నారు. టీడీపీతో బీసీలకు న్యాయం జరుగుతుందని, త్వరలోనే బీసీ చైతన్యయాత్ర ద్వారా ప్రజలకు మరింత చేరువ అవుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పసల గంగాప్రసాద్, మైలారి రాజశేఖర్, అవధానం సుధీర్, ప్రసాద్‌నాయుడు, ప్రసాద్‌యాదవ్, వెంకటేశ్వర్లు, కేవీ నాయుడు, కృష్ణయ్య, సుజాతమ్మ, బాబు, రమణయ్య, చక్రపాణి, ముత్యాలయ్య, వెంకటేశ్వర్లు, గోపాలకృష్ణ తదితరులు ఉన్నారు.

టీడీపీ రాష్ట్ర కార్యదర్శిగా డాక్టర్ మస్తాన్‌యాదవ్



వెంకటగిరి, జనవరి 7: తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా వెంకటగిరికి చెందిన డాక్టర్ బొలిగల మస్తాన్ యాదవ్‌ను నియమితులయ్యారు. పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు సూచనల మేరకు రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు ఆదివారం నియామక ఉత్తర్వులు జారీ చేశారు.

అవినీతిని ప్రశ్నిస్తే కేసులు పెడతారా?



సమావేశంలో మాట్లాడుతున్న ప్రజా సంఘాల నాయకులు

వెంకటగిరి టౌన్, జనవరి 7: డక్కిలి వెలుగు కార్యాలయంలో అవినీతి జరుగుతోందని ఏపీఎం పాలమ్మను ప్రశ్నిస్తే కేసులు పెట్టారని ఏపీ ప్రజా సంఘాల ఐక్యవేదిక నాయకులు మండిపడ్డారు. ఆదివారం వారు మీడియాతో మాట్లాడుతూ పొదుపు కార్యాలయంలో కోటి రూపాయలు మేర అవినీతి జరిగిందని ఆరోపించారు. సమాచారం హక్కు చట్టం ద్వారా పొదుపు వివరాలు అడిగితే తప్పుడు కేసులు పెట్టించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయంపై ఉద్యమానికి కార్యచరణ ప్రణాళిక ప్రకటిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో చిరంజీవి, కృష్ణయ్య, చెంచుకృష్ణ, రవి, రంగయ్య, మునెయ్య, సుందరయ్య, వెంకటయ్య, రఫీ, శీనయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల సమస్యల పరిష్కారానికి కృషి



విద్యార్థులతో మాట్లాడుతున్న టీఎన్ఎస్ఎఫ్ నాయకులు

చిల్లకూరు, జనవరి 7: విద్యార్థుల సమస్యల పరిష్కారానికి టీఎన్ఎస్ఎఫ్ కృషి చేస్తుందని ఆ సంఘం తిరుపతి పార్లమెంటు అధికార ప్రతినిధి నవీన్ చంద్ర అన్నారు. ఆదివారం స్థానిక అంబేడ్కర్ గురుకుల పాఠశాలను సందర్శించి విద్యార్థుల నుంచి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురుకులంలో వసతులు సక్రమంగా లేవని, తాగునీటి కొళాయిల వద్ద అపరిశుభ్రంగా ఉందన్నారు. ప్రహరీ శిథిలావస్థకు చేరుకుని కూలి పోయిందన్నారు. కార్యక్రమంలో మురళీకృష్ణ, సునీల్, పృథ్వీరెడ్డి, వాసు గౌడ్, ముత్యాలయ్య, పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బాబుతో భవిష్యత్తుకు గ్యారెంటీ



మాచవరంలో కరపత్రాలు పంచిపెడుతున్న టీడీపీ నాయకులు

ఓజిలి, జనవరి 7: చంద్రబాబు నాయుడుతోనే రాష్ట్ర ప్రజలకు మంచి భవిష్యత్తు ఉంటుందని టీడీపీ నాయకులు అన్నారు. ఓజిలి మండలం మాచవరంలో ఆదివారం బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. మాచవరంతో పాటు కుందాం, కుందాంరాజుపాళెం, ముమ్మాయపాళెం గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి టీడీపీ మినీమేనిఫెస్టో గురించి వివరిస్తూ కరపత్రాలను పంచిపెట్టారు. ఈసందర్భంగా టీడీపీ మండల కన్వీనరు గుజ్జలపూడి విజయకుమార్‌నాయుడు, యూనిట్ ఇన్‌చార్జి పొదర్తి ప్రకాశ్‌నాయుడు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వాన్ని గద్దెదింపి చంద్రబాబును ముఖ్యమంత్రి చేసుకుంటేనే భావితరాల భవిష్యత్తుకు గ్యారంటీ ఉంటుందన్నారు. కార్యక్రమంలో భక్తవత్సలరావు, పొదర్తి కిరణ్‌కుమార్, గిద్దలూరు కృష్ణయ్య, మల్లిఖార్జున్‌రాజు, రావుల భాస్కర్, దారా చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

ముగ్గుల పోటీలు



బహుమతులు ప్రదానం చేస్తున్న నిర్వాహకులు

వెంకటగిరి టౌన్, జనవరి 7: వెంకటగిరి కోర్టు ఆవరణలో స్వామి వివేకానందా యువసైన్యం ఆధ్వర్యంలో ఆదివారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. ముఖ్యఅతిథులుగా ఆదిశంకర ఇంజనీరింగ్ కళాశాల కరస్పాండెంట్ వంకి పెంచలయ్య, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, వెంకటగిరి నియోజకవర్గ ఇన్‌చార్జి ఎస్ఎస్ఆర్ నాయుడు, టీడీపీ నేత బొలిగల మస్తాన్ యాదవ్ హాజరయ్యారు. కార్యక్రమంలో యువసైన్యం సభ్యులు పాల్గొన్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.81 కోట్లు

తిరుమల, జనవరి7(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.81 కోట్లు లభించింది. శుక్రవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ శనివారం లెక్కించి ఆదివారం ఉదయం ప్రకటించింది.

సీఐల బదిలీ

నాయుడుపేట, జనవరి 7: నాయుడుపేట అర్బన్, రూరల్ సీఐలు బదిలీ అయ్యారు. అర్బన్ సీఐగా పనిచేస్తున్న కె.నరసింహారావు బాపట్ల జిల్లా సంతమగులూరు సర్కిల్‌కు బదిలీ కాగా, రూరల్ సర్కిల్ సీఐ వీరసోమయ్య వీఆర్‌కు వెళ్లారు. ఒంగోలు రూరల్ సీఐ శ్రీనివాసరెడ్డి నాయుడుపేట అర్బన్‌కు, గుంటూరు రేంజ్ వీఆర్‌లో ఉన్న డి.జగన్‌మోహన్‌రావు నాయుడుపేట రూరల్ సర్కిల్‌కు బదిలీ చేస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ శ్రీకాంత్

పెళ్లకూరు, జనవరి 7: మండలంలోని శిరసనంబేడు రాజుపాలెం గ్రామానికి చెందిన బిట్రగుంట జనార్దన్‌రాజు(86) ఆదివారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు.... జనార్దన్‌రాజు కొంతకాలంగా మతిస్థిమితం లేకుండా తిరుగుతున్నాడు. ఆదివారం తెల్లవారుజామున ఇంటి నుంచి నడుచుకుంటూ జాతీయ రహదారిపైకి చేరుకున్నాడు. గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఎస్ఐ శ్రీకాంత్ సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.





గూడూరులో ఎస్మా జీవో ప్రతులను తగలబెడుతున్న అంగన్వాడీలు - సూళ్లూరుపేట ఐసీడీఎస్ కార్యాలయం వద్ద నిరసన

బెదిరింపులకు భయపడేది లేదు

సూళ్లూరుపేట, జనవరి 7: తమ న్యాయపరమైన డిమాండ్లను నెరవేర్చమని పోరాటం చేస్తుంటే ప్రభుత్వం బెదిరింపులకు పాల్పడుతోందని, భయపడే ప్రసక్తే లేదని అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ నాయకురాలు హైమావతి అన్నారు. ఆదివారం స్థానిక ఐసీడీఎస్ కార్యాలయం వద్ద తడ, సూళ్లూరుపేట, దొరవారిసత్రం మండలాలకు చెందిన అంగన్వాడీల ఆందోళన చేశారు. సీఎం జగన్ ఇచ్చిన హామీలను నెరవేర్చమని కోరుతూ నాలుగు వారాలుగా అంగన్వాడీలు సమ్మె కొనసాగిస్తుంటే ప్రభుత్వం పట్టించుకోకపోగా చీకటి జీవోలతో బెదిరించాలనుకోవడం దుర్మార్గమన్నారు. తమ డిమాండ్లను పరిష్కరించేంత వరకు పోరాటం ఆగదన్నారు. వీరికి సీఐటీయూ నాయకులు సంఘీభావం తెలిపారు.

గూడూరు: రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీల సమ్మెను నిషేధిస్తూ తీసుకొచ్చిన ఎస్మా చట్టాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని అంగన్వాడీలు అన్నారు. ఆదివారం స్థానిక గ్రామసేవకుల భవనం వద్ద అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిరవధిక సమ్మె 27వ రోజుకు చేరుకుంది. దీక్షా శిబిరంలో అంగన్వాడీలు కళ్లకు నల్లగంతలను కట్టుకుని నిరసన తెలిపారు. ఎస్మా చట్టాన్ని నిరసిస్తూ జీవో ప్రతిమలను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో సీఎం జగన్ ఇచ్చిన హామీలను నెరవేర్చాలని తాము సమ్మె చేస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం ఎస్మా చట్టాన్ని తీసుకురావడం దారుణమన్నారు. వెంటనే ఈ చట్టాన్ని ఉపసంహరించుకుని తమ డిమాండ్లను పరిష్కరించాలన్నారు. లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో శివకుమార్, బీవీ.రమణయ్య, సురేష్, ప్రసాద్, రమణయ్య, ఇంద్రావతి, ప్రభావతి, మునికుమారి, చంద్రయ్య, పెంచలమ్మ, లక్ష్మి, హైమావతి, మంగమ్మ, సుబ్బమ్మ తదితరులు పాల్గొన్నారు.

కోట: పట్టణంలోని ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం ఎదుట ఆదివారం కోట, వాకాడు, చిట్టమూరు మండలాలకు చెందిన అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు నిరసన తెలిపారు. వారికి యూటీఎఫ్ నేతలు సంఘీభావం ప్రకటించి మద్దతుగా శిబిరంలో కూర్చొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

నాయుడుపేట టౌన్: పాదయాత్ర సమయంలో అక్కా చెల్లెమ్మలు అంటూ జగన్ ఇచ్చిన హామీలను వెంటనే అమలు పరచాలని సీఐటీయూ నాయకుడు ముకుంద డిమాండ్ చేశారు. నాయుడుపేట - శ్రీకాళహస్తి బైపాస్‌రోడ్డు సమీపంలోని ఐసీడీఎస్ కార్యాలయం వద్ద నిర్వహిస్తున్న సమ్మెలో భాగంగా ఆదివారం అంగన్వాడీలు, సీఐటీయూ నాయకులు నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్వాడీలపై ఎస్మాచట్టం ప్రయోగించడం సబబుకాదన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ ప్రాజెక్టు కార్యదర్శి శ్యామలమ్మ తదితరులు పాల్గొన్నారు.





నాయుడుపేటలో భిక్షాటన చేస్తూ పారిశుధ్య కార్మికుల నిరసన - గూడూరులో మానవహారం

సమస్యలు పరిష్కరించకపోతే సమ్మె ఉధృతం

నాయుడుపేట టౌన్, జనవరి 7: పారిశుధ్య కార్మికుల న్యాయమైన సమస్యలు పరిష్కరించకపోతే సమ్మెను ఉధృతం చేస్తామని సీఐటీయూ నాయకులు చాపల వెంకటేశ్వర్లు తెలిపారు. ఆదివారం పారిశుధ్య కార్మికులు భిక్షాటన చేస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులు 13 రోజులుగా సమ్మె చేస్తుంటే ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఇకనైనా స్పందించి పారిశుధ్య కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

గూడూరు: మున్సిపల్ పారిశుధ్య కార్మికుల సమస్యలను రాష్ట్రప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక మున్సిపల్ కార్యాలయం మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిరదిక సమ్మె 13వ రోజు కొనసాగింది. దీక్షా శిబిరం వద్ద ధర్నా నిర్వహించి మున్సిపల్ కార్యాలయం ఎదుట మానవహారాన్ని ఏర్పాటు చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని సమ్మె చేస్తుంటే మున్సిపల్ అధికారులు ప్రైవేటు కార్మికుల చేత పనులు చేయించడం మంచిపద్ధతి కాదన్నారు. తమ సమస్యలను పరిష్కరించేలా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలన్నారు. సమ్మెలో ఉన్న కార్మికులకు పోటీగా అర్ధరాత్రి సమయంలో ప్రైవేటు కార్మికులను పెట్టి వాహనాల ద్వారా చెత్త తొలగిస్తుండడంతో సమ్మెలో ఉన్న పారిశుధ్య కార్మికులు వెళ్లి అడ్డుకున్నారు. కార్యక్రమంలో గోపినాథ్, శివకుమార్, బీవీరమణయ్య, సురేష్, రమేష్, కోటేశ్వరరావు, ప్రభావతి, సంపూర్ణమ్మ, పెంచలప్రసాద్, రాజేష్, బాలాజీ, రాఘవయ్య, సుబ్రహ్మణ్యం, శాంతివర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

సూళ్లూరుపేట: సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలంటూ మున్సిపాలిటీ పారిశుధ్య కార్మికులు చేస్తున్న సమ్మె కొనసాగుతోంది. ఆదివారం స్థానిక మున్సిపాలిటీ కార్యాలయం వద్ద కార్మికులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంట్రాక్టు కార్మికులందరినీ పర్మినెంట్ చేసి వేతనం పెంచాలని యూనియన్ నాయకులు సాంబశివయ్య అన్నారు. ప్రభుత్వం చర్చల పేరుతో కాలయాపన చేసి కార్మికులను మోసం చేస్తోందన్నారు. ప్రైవేటు కార్మికులను పెట్టి చెత్తను తొలగించడం సమంజసంకాదని, తమకు ఇచ్చిన మాట ప్రకారం జీతాలు పెంచి సమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వం చొరవతీసుకోవాలని కోరారు.

తవ్వి.. వదిలేశారు..!



గుంత తవ్వి మట్టిని రోడ్డులో పోసిన దృశ్యం

వెంకటగిరిటౌన్, జనవరి 7: పట్టణంలోని కాశీపేట కూడలిలో మున్సిపాలిటీ సిబ్బంది తాగునీరు పైపులైన్ కోసం గుంత తవ్వి మరమ్మతులు చేశారు. పనులు పూర్తయ్యాక గుంతను పూర్తిగా పూడ్చకుండా వదిలేశారు. తవ్విన మట్టి రోడ్డులో పోశారు. దీంతో పాదచారులు, వాహనదారులకు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి గుంత పూడ్చాలని ప్రజలు కోరుతున్నారు.

బెటాలియన్‌లో స్పోర్ట్స్ మీట్



పరుగు పందెంలో బెటాలియన్ సిబ్బంది

వెంకటగిరి టౌన్, జనవరి 7: మండల పరిధిలోని బెటాలియన్‌లో యాన్యువల్ స్పోర్ట్స్ మీట్‌ను కమాండెంట్ ప్రకాష్ ఆదివారం ప్రారంభించారు. 800 మీటర్స్ రన్నింగ్, జావలిన్, డిస్కస్ త్రో, వాలీబాల్, హై జంప్, లాంగ్ జంప్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్ ఎంఎల్ మనోహర్, ఆనంద్, సిబ్బంది పాల్గొన్నారు.

16న తిరుమలలో శ్రీవారి పార్వేటఉత్సవం

తిరుమల, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి పార్వేట ఉత్సవం ఈనెల 16న ఘనంగా నిర్వహించనున్నారు. గోదాపరిణయోత్సవం సందర్భంగా ఉదయం 9 గంటలకు ఆండాళ్ అమ్మవారి మాలలను పెద్దజీయర్ మఠం నుంచి ఆలయ నాలుగు మాడవీధుల్లో ఊరేగింపుగా శ్రీవారి ఆలయానికి తీసుకువెళ్లి స్వామి వారికి సమర్పిస్తారు. మధ్యాహ్నం ఒంటి గంటకు మలయప్పస్వామి, కృష్ణస్వామి పార్వేట మండపానికి వేంచేపు చేస్తారు. అక్కడ ఆస్థానం, పారువేట కార్యక్రమాలు నిర్వహిస్తారు. అనంతరం స్వామివారు ఆలయానికి చేరుకుంటారు. ఈ ఉత్సవం సందర్భంగా శ్రీవారి ఆలయంలో నిర్వహించే అష్టదళ పాదపద్మారాధన, కళ్యాణోత్సవం, ఊంజల్‌సేవ, బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవలను టీటీడీ రద్దు చేసింది.

చిన్నమాంబట్టులో ఉచిత వైద్య శిబిరం

తడ, జనవరి 7: మండల పరిధిలోని చినమాంబట్టులో ఆదివారం నాయుడుపేట ట్రినిటి ఆస్పత్రి చైర్మన్ నాగూరయ్య ఆధ్వర్యంలలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో గ్రామంలో 300 మందికి పైగా విచ్చేసి వైద్య పరీక్షలు చేయించుకొన్నారు. డాక్టర్ సందీప్, రాజశేఖర్‌లు పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

తమిళనాడు రేషన్ బియ్యం పట్టివేత

సూళ్లూరుపేట, డిసెంబరు 7: తమిళనాడు నుంచి నెల్లూరుకు అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని ఆదివారం విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. సివిల్ సప్లయాయ్ డీటీ ఓబయ్య కథనం మేరకు సమాచారం.... చెన్నై వైపు నుంచి నెల్లూరు వెళ్తున్న లారీని ఆర్టీసీ డిపో వద్ద తనిఖీ చేయగా 330బస్తాలు తమిళనాడు బియ్యం ఉన్నట్లు గుర్తించారు. లారీతో డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నట్లు లారీని స్వాధీనం చేసుకొన్నారు. పట్టుబడిన బియ్యం విలువ రూ.5.50 లక్షలు ఉంటుందని విజిలెన్స్ రిజిస్ట్రార్ విజయకుమారు తెలిపారు.

మద్యం బాటిళ్ల స్వాధీనం

తడ, జనవరి 7: అక్రమంగా తరలిస్తున్న 20 మద్యం బాటిళ్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఆదివారం సాయంత్రం శ్రీసిటీ జీరో పాయింట్ వద్ద పోలీసులు తనిఖీలు చేపట్టారు. వరదయపాళెం మండలం కొండూరు సొసైటీకి చెందిన స్వర్ణగా సంచిలో 20 మద్యం బాటిళ్లను తీసుకెళ్తుండగా గుర్తించి స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

వచ్చే ఎన్నికల్లో వైసీపీదే విజయం

కోట, జనవరి 7: చంద్రబాబునాయుడు, పవన్‌కల్యాణ్ ఎన్ని కుట్రలు, కుతంతాలు పన్నినా తుది విజయం వైసీపీదేనని నెల్లూరు జిల్లా కోవ్వూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్న కుమార్‌రెడ్డి అన్నారు. కోటలో ఆదివారం ఆయన మీడితో మాట్లాడుతూ సీఎం జగన్ చేసిన అభివృద్ధి, సంక్షేమమే వైసీపీ గెలుపునకు దోహదపడుతాయన్నారు. ప్రజలంతా జగన్‌వైపే ఉన్నారని, మళ్లీ రాష్ట్రంలో వైసీపీ జెండా ఎగురవేయడం ఖాయమన్నారు. ఆయన వెంట చలపతి, జగదీష్ రెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి, రజిత్‌కుమార్‌రెడ్డి ఉన్నారు.

సూళ్లూరుపేటలో వర్షం

సూళ్లూరుపేట, జనవరి 7: సూళ్లూరుపేటలో ఆదివారం రాత్రి తేలికపాటి జల్లులతో కూడిన వర్షం పడింది. ఉదయం నుంచే కారుమబ్బులు కమ్ముకొని చల్లని గాలులతో కూడిన వాతావరణం నెలకొంది. రాత్రి తేలిక పాటి వర్షం కురిసింది. కార్మికుల సమ్మెతో పట్టణ వీధుల్లో చెత పేరుకుపోయి ఉండడంతో వర్షంతో బురదమయంగా మారి పాదచారులు అడుగుపెట్టలేని పరిస్థితి నెలకొంది.

పేరుకుపోతున్న చెత్త

వెంకటగిరి టౌన్, జనవరి 7: మున్సిపల్ కార్మికులు 12రోజులుగా సమ్మె చేస్తుండడంతో పట్టణవ్యాప్తంగా చెత్త పేరుకుపోతోంది. వీధుల్లో, రోడ్లపై చెత్త పోగవడంతో కుళ్లిపోయి దుర్వాసన వెదజల్లుతోంది. చెత్త కుప్పల వద్ద పందులు, ఆవుల సంచారంతో ఎక్కువైంది. అంతేకాకుండా దోమలు వృద్ధి చెందుతున్నాయి. దుర్వాసన కారణంగా వీధుల్లో తిరగాలంటే ఇబ్బందిగా ఉందని ప్రజలు వాపోతున్నారు. మున్సిపాలిటీ అధికారులు చొరవ తీసుకుని పట్టణంలో చెత్త తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.



చంద్రబాబును సీఎం చేయడమే మన ధ్యేయం



సమావేశంలో మాట్లాడుతున్న వేనాటి రామచంద్రా రెడ్డి

సూళ్లూరుపేట, జనవరి 7: రాష్ట్రం బాగుండాలంటే మళ్లీ చంద్రబాబును సీఎంను చేసుకోవాలని, అందుకు నాయకులు, కార్యకర్తలందరూ సమన్వయంతో పనిచేయాలని టీడీపీ నేత, టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు వేనాటి రామచంద్రారెడ్డి అన్నారు. ఆదివారం ఆయన సూళ్లూరుపేట పట్టణ నాయకులతో సమ్మేళన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో టీడీపీ గెలుపే ధ్యేయంగా అందరూ పనిచేయాలన్నారు. టీడీపీ జిల్లా కార్యదర్శి వేనాటి సతీష్ రెడ్డి మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో రాష్ట్రం అన్ని విధాలా వెనక్కి వెళ్లిందని, మళ్లీ టీడీపీ వస్తేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు చిట్టేటి పెరుమాల్, తన్నీరు శేషగిరిరావు, నాపా మునిరాజా, బుద్ధి విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పెంచలకోన ఆలయానికి రూ.2 లక్షల వితరణ



విరాళం అందజేస్తున్న జయరామరాజు

నాయుడుపేట, జనవరి 7: పెంచలకోనలో నెలకొన్న లక్ష్మీ నరసింహస్వామి ఆలయానికి నాయుడుపేట మండలం కోనేటిరాజుపాళెం గ్రామానికి చెందిన ముప్పాళ్ల జయరామరాజు, సంపూర్ణమ్మ దంపతులు రూ.2 లక్షల విరాళాన్ని ఆదివారం అందజేశారు. ఇందులో 1,00,116 అన్నదానానికి, 1,00,116 ఆలయ అభివృద్ధికి అందజేసినట్లు దాతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముప్పాళ్ల చంద్రశేఖర్‌రాజు, రవీంద్రరాజు, శేఖర్‌రాజు, అర్జున్ రాజు, మురళీరాజు తదితరులు ఉన్నారు.

రుద్రవరంలో ఇంటింటికీ టీడీపీ



కరపత్రాలు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

కోట, జనవరి 7: మండల పరిధిలోని రుద్రవరంలో ఆదివారం ఇంటింటికీ టీడీపీ కార్యక్రమం జరిగింది. రుద్రవరం, అరుంధతీయవాడ, గిరిజన కాలనీల్లో ఇంటింటా తిరిగి ఇంటింటా తిరిగి మేనిఫెస్టో గురించి వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు సర్వోత్తమరెడ్డి, మాజీ సర్పంచు యల్లశిరి కృష్ణయ్య, యల్లశిరి ముత్యాలయ్య, బాలకృష్ణయాదవ్, మధుయాదవ్, వేణు, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

గంగమ్మకు పూజలు



గంగమ్మ ఆలయానికి అంబలి, సద్దిఅన్నం తీసుకెళ్తున్న మహిళలు

చిల్లకూరు, జనవరి 7: స్థానిక పాలకేంద్రం సమీపంలోని నూతనంగా నిర్మించిన గంగమ్మ ఆలయంలో అమ్మవారికి ఆదివారం ప్రత్యేక పూజలు జరిపారు. మహిళలు అంబలి, సద్ది అన్నం నెత్తిమీద పెట్టుకుని ఆలయం వద్ద చేరుకుని అమ్మవారికి ప్రసాదంగా నివేదించారు. భక్తులు పూజా కార్యక్రమంలో పాల్గొని అంబలి ప్రసాదాన్ని స్వీకరించారు.

ముత్యాలమ్మకు..

చిల్లకూరు, జనవరి 7: మండలంలోని తూర్పుకనుపూరు గ్రామంలో వెలసిన ముత్యాలమ్మకు ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఆలయం వద్ద పొంగళ్లు పెట్టుకుని నైవేద్యం నివేదించి అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

కోటమ్మకు..

కోట, జనవరి 7: కోటలోని గ్రామదేవత కోటమ్మకు ఆదివారం విశేష పూజలు జరిగాయి. అమ్మవారికి అభిషేకాలు చేసి చందన, పుష్పాలంకరణలో ఉంచారు. కోట, వాకాడు, చిట్టమూరు, చిల్లకూరు, ఓజిలి మండలాలకు చెందిన భక్తులు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఆలయ పాలకమండలి ఆధ్వర్యంలో తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.